


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL   ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి   బుధవారం 23 మార్చి 2022   సంపుటి: 03   సంచిక: 193   పేజీలు: 4   వెల: రూ 3-00


## 'ఏపీకి రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇవ్వమని కోరాం'



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర రైల్వేమంత్రిని కలిసినట్లు ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఏపీలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపిన విజయసాయి రెడ్డి.. అరకు రైలుకు విస్టాడోమ్ కోచ్‌ల సంఖ్య పెంచమని కోరినట్లు పేర్కొన్నారు.రైల్వేమంత్రిని కలిసిన అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ .. 'ఏపీకి రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం.రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయమన్నాం. ఏపీలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరాం. రైల్వేలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశాం. వాల్తేర్ డివిజన్‌ను కొనసాగించాలని కేంద్ర మంత్రిని కోరాం. సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ ఆపరేషన్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాం' అని తెలిపారు. తమ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన? పేర్కొన్నారు. ఇదిలా ఉంచితే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 120 మంది ఎంపీల నుంచి సంతకాలు సేకరించిన విషయాన్ని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని, విశాఖ ప్రైవేటీకరణ వ్యతిరేక సమితితో కలిసి ఎంపీల సంతకాల జాబితాను ప్రధానికి ఇస్తామని విజయసాయిరెడ్డి తెలిపారు.

## ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి

### అసెంబ్లీలో స్పష్టం చేసిన సీఎం జగన్



అమరావతి మార్చ్ 22 : 2023 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం జగన్ అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీడబ్ల్యూసీ నుండి డిజైన్లు వస్తే ప్రాజెక్టు నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసేస్తామన్నారు. ఈ ప్రాజెక్టును వైఎస్ఆర్ ప్రారంభించారని, ఆయన కొడుగ్గా తానే పూర్తిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. సభ్యులు అడిగినట్టు పోలవరం వద్ద వైఎస్ఆర్ విగ్రహం పెడతామని, ప్రాజెక్టును ఆయనకు డెడికేట్ చేస్తామని జగన్ ప్రకటించారు.పోలవరంపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం అన్నారు. పోలవరానికి చంద్రబాబు పనులే శాపంగా మారాయన్నారు. స్పిల్‌వే నిర్మాణంలో చంద్రబాబు తప్పులు చేశారని ఆరోపించారు. పోలవరం పూర్తవుతుంటే చంద్రబాబుకు కడుపుమంటగా ఉందని, గతంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ జోలికి చంద్రబాబు వెళ్లలేదని విమర్శించారు. డిజైన్ ప్రకారం నదిని కుడివైపునకు మళ్లించాలని, అప్పర్, డౌన్ కాఫర్ డ్యాం నిర్మాణ పనుల్లో కొంత వదిలేశారని, దీనివల్ల చాలా నష్టం జరిగిందని జగన్ ఆరోపించారు. వరదల వల్ల 10-25 లక్షల క్యూసెక్కుల నీరు చేరిందని, వరద ఉధృతికి డయాఫ్రాం వాల్ బాగా దెబ్బతిన్నదని, దీన్ని సరిచేయడానికి రెండేళ్లుగా నిపుణులు ప్రయత్నిస్తున్నారని, ఇదేనా చంద్రబాబు విజయం? అని సీఎం జగన్ ప్రశ్నించారు.పోలవరం ఎత్తు ఒక్క ఇంచ్ కూడా తగ్గదని సీఎం జగన్ ప్రకటించారు. జాతీయ ప్రాజెక్టైనా పోలవరం విషయంలో.. కేంద్రంతో ఇన్నిసార్లు మాట్లాడడానికి కారణం చంద్రబాబేనన్నారు. చంద్రబాబు కమిషన్ల కోసం ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి.. ప్రాజెక్ట్‌ను తన చేతుల్లోకి తీసుకున్నారని విమర్శించారు. 2017 వరకూ పోలవరం పనులను చంద్రబాబు గాలికొదిలేశారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ గురించి చంద్రబాబుకు ఏమైనా తెలుసా? అని ప్రశ్నించారు. 2013-14 రేట్ల ప్రకారం చంద్రబాబు ఎలా ఒప్పుకున్నారని నిలదీశారు. పోలవరం చూపించడానికి వందకోట్లు ఖర్చు చేశారని, అందుకే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పారని సీఎం జగన్ వ్యాఖ్యానించారు.

## సీఎం జగన్‌ను కలిసిన క్రీడాకారిణి షేక్ సాదియా అల్మస్

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ విన్నర్ షేక్ సాదియా అల్మస్ కలిశారు. షేక్ సాదియా అల్మస్ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో 2021 డిసెంబర్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె 3 స్వర్ణ పతకాలు, 1 రజత పతకం సాధించారు. షేక్ సాదియాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం జగన్ ప్రకటించారు.అదే విధంగా మంగళగిరిలో పవర్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, షేక్ సాదియా తండ్రి సంధాని, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రఘురామకృష్ణరాజుపై పరువునష్టం దావా వేస్తాం: రజత్ భార్గవ

అమరావతి: ఎంపీ రఘురామ కృష్ణరాజుపై పరువు నష్టం దావా వేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని ఏపీ ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రజత్ భార్గవ తెలిపారు. ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీ రఘురామ చేయించిన మద్యం శాంపిల్స్‌పై ఏపీ ప్రభుత్వం కౌంటర్ ఇచ్చింది. పరీక్షలు చేసిన ఎస్‌జీఎస్ ల్యాబ్ ఇచ్చిన సమాధానం లేఖను రజత్ భార్గవ మీడియాకు విడుదల చేశారు. ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్ ఏపీ నుంచి సేకరించినవే అనటానికి ఆధారాలు లేవని తెలిపారు. పరీక్ష చేయటానికి ఎక్సైజ్ చట్టం ప్రకారం అనుసరించాల్సిన ఏ నిబంధనను అనుసరించలేదని పేర్కొన్నారు.పరీక్ష చేయమన్నవాళ్ల అడగకపోవటంతో శాంపిల్స్‌ను ఐఎస్ నిబంధనల ప్రకారం చేయలేదని ఎస్‌జీఎస్ స్పష్టం చేసిందని తెలిపారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేసిందేనని చెప్పారు. చెన్నైలోని ల్యాబ్‌కి పంపించటం వెనుక కారణం ఏంటో తెలియదని, ఎస్‌జీఎస్ తమ లేఖలో శాంపిల్స్‌లో ఏ స్థాయిలో రసాయనాల ఆనవాళ్లు ఉన్నాయో పరీక్షించలేదని పేర్కొన్నారు.తీసుకుని వచ్చిన శాంపిల్స్ హానికరం అని ఎస్‌జీఎస్ నివేదిక ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. హైడ్రాక్సైడ్ ఉండటమే ప్రమాదకరం కాదని, కొన్ని హైరెసల్యూషన్ పరీక్షల్లో మంచి నీళ్లు కూడా తాగటానికి హానికరం అని వస్తాయని చెప్పారు. ఎవరైనా పరీక్షలు చేయించవచ్చు.. కానీ బీఎస్ఐ ప్రమాణాలకు అనుగుణంగా చేయించాలని అన్నారు. ప్రజల్ని తప్పు దారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లోకేష్ ను ఉద్దేశించి అనలేదు : నారాయణ స్వామి

అమరావతి: నారా లోకేశ్?ను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత కామెంట్లు చేయలేదని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణతో జగన్ ప్రభుత్వానికి ఇబ్బందులు వస్తాయంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి తనతో మాట్లాడారన్నారు. ఆ వ్యక్తిని ఉద్దేశించి తాను చేసిన కామెంట్లని తనను ఉద్దేశించినట్టుగా లోకేష్ భావిస్తున్నారని చెప్పారు. సభలో అలాంటి కామెంట్లు చేయకూడదని.. తాను పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నానని నారాయణ స్వామి అన్నారు. "నన్ను ఏ స్థాయిలో రెచ్చగొడితే నేను అలా మాట్లాడానో గమనించాలి. బడుగులకు న్యాయం చేస్తోన్న ప్రభుత్వాన్ని కూలగొడతామంటే కోపం రాదా..?. సీఎం జగన్ను వాడూ వీడూ అని ఇష్టానుసారంగా లోకేష్ మాట్లాడుతున్నారు. మద్యనిషేధం.. మద్య నియంత్రణ గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు. యనమల వియ్యంకుడుకు.. అయ్యన్నపాత్రుడు వంటి వారు మద్యం డిస్టలరీలు నడుపుతున్నారు. ఇటీవలే అయ్యన్నపాత్రుడు తన డిస్టలరీలను అమ్ముకున్నారట. పదవుల కోసం టీడీపీ వాళ్లూ అర్రులు చాస్తారు.. వైసీపీ వాళ్లు పదవుల గురించి అర్రులు చాచరు. ఎస్సీలను చులకనగా



చూసేది చంద్రబాబే. మైనార్టీ సభ్యుడు ప్రమాణ స్వీకారం చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేశారు లోకేష్. చంద్రబాబు, లోకేష్ వంటి వారు అబద్ధాల్లో పెరిగి.. అబద్ధాలతోనే రాజకీయాలు చేస్తున్నారు. చంద్రబాబు ఔరంగజేబు కోవకు చెందిన వాడు. చంద్రబాబు ఏనాడైనా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారా..? చంద్రబాబులో ఇంకా మార్పు రాలేదు. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వాళ్లకూ సంక్షేమ పథకాల లబ్ధి జరుగుతోంది. జగన్ ఎవ్వరికీ వ్యతిరేకం కాదు. జగన్ పరిపాలన రామరాజ్యాన్ని తలపిస్తోంది. ఖరీదైన మద్యాన్ని 10-15 ఏళ్లపాటు తాగితే.. శరీరంలో ఆల్కహాల్ ఉంటుంది. తాగుడుకు అలవాటు పడిన వాళ్ల ఆరోగ్యం సరిగా ఉండదు." అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు.

## ఇండియా వైఖరి భిన్నంగా ఉంది: బైడెన్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగిన రష్యాపై అమెరికా మిత్ర దేశాల వైఖరి అంతా ఒక్కటిగానే ఉందని, కానీ ఒక్క ఇండియా మాత్రమే భిన్నమైన విధానాన్ని అవలంభిస్తున్నట్లు జో బైడెన్ అన్నారు. వాషింగ్టన్‌లో వ్యాపారవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ బైడెన్ ఈ వాఖ్యలు చేశారు. అమెరికా నేతృత్వంలోని కూటమి దేశాలను బైడెన్ కీర్తించారు. నాటో, యురోపియన్ యూనియన్, ఆసియా దేశాలు అన్నీ పుతిన్‌కు వ్యతిరేకంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. కానీ ఒక్క భారత్ వైఖరి మాత్రమే మినహాయింపుగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. క్వాడ్ గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలు రష్యా తీరును ఖండిస్తున్నాయని, కానీ రష్యా నుంచి డిస్కౌంట్‌లో ఆయిల్ కొనేందుకు సిద్ధమైన ఇండియా విధానం భిన్నంగా ఉన్నట్లు బైడెన్ ఆరోపించారు. యూఎన్‌లోనూ రష్యాకు వ్యతిరేకంగా ఇండియా ఓటు వేయలేదు. నాటోతో పాటు పసిఫిక్ దేశాలన్నీ ఐక్యంగా ఉన్నట్లు చెప్పారు. క్వాడ్ గ్రూపులో ఇండియా ఒక్కటే మినహాయింపు అని, జపాన్ చాలా తీవ్రంగా రష్యాను వ్యతిరేకిస్తోందని, అలాగే ఆస్ట్రేలియా కూడా ఉందన్నారు.



## రాష్ట్రపతి, ప్రధానికి 125 ఏండ్ల యోగా గురువు పాదాభివందనం..

న్యూఢిల్లీ : ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో నిన్న జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో 125 ఏండ్ల యోగా గురువురు స్వామి శివానంద రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీకి పాదాభివందనం చేశారు. పద్మ శ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద పేరును పిలవగానే ఆయన తన చైర్‌లో నుంచి లేచి.. వినయంగా మోదీ వద్దకు వెళ్లి పాదాభివందనం చేశారు. మోదీ కూడా వంగి ప్రతి నమస్కారం చేశారు. అక్కడ్నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్లిన స్వామి శివానంద ఆయన పాదాలకు కూడా నమస్కరించారు. రాష్ట్రపతి కూడా ఆ పెద్ద మనిషిని గౌరవించి, పద్మ శ్రీ అవార్డును అందజేశారు. ఈ సమయంలో అక్కడున్న వారంతా లేచి నిలబడి, స్వామి శివానందకు కరతాళ ధ్వనులతో శుభాకాంక్షలు తెలిపారు.స్వామి శివానంద తెలుపు రంగు కుర్తా, ధోతీ ధరించారు. చెప్పులు లేకుండా ఓ సామాన్యుడిలా అవార్డును స్వీకరించారు. స్వామి శివానంద తన జీవితాన్ని మొత్తం సమాజ సేవకు అంకితం చేశారు. 1896, ఆగస్టు 8న అవిభాజ్య భారత్‌లోని సిల్హెత్ జిల్లా(ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో శివానంద జన్మించారు. ఆరేండ్ల వయసులోనే తన తల్లిదండ్రులను కోల్పోయారు. పేదరికం వల్ల ఆకలితో అలమటించారు. ఈ క్రమంలో అనాథగా ఉన్న శివానందను పశ్చిమ బెంగాల్‌లోని గురూజీ ఆశ్రమంలో చేర్పించారు. గురు ఓంకారనంద గోస్వామి.. శివానందను పెంచి పెద్ద చేశారు. ఆధ్యాత్మిక బోధనలతో పాటు యోగాను శివానందకు గోస్వామి నేర్పించారు. ఈ క్రమంలో నిత్యం యోగా సాధన చేసే శివానంద 125 ఏండ్ల వయసులోనూ చలాకీగా ఉన్నారు. కరోనా టీకా రెండు డోసులు తీసుకున్న అత్యంత వృద్ధుడిగా శివానంద రికార్డు సృష్టించారు.



## ఏపీలో స్మార్ట్ సిటీల చైర్మన్లు రాజీనామా




అమరావతి: స్మార్ట్ సిటీల నామినేటెడ్ చైర్మన్ల విషయంలో కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో తిరుపతి, ఏలూరు, విశాఖ, కాకినాడ స్మార్ట్ సిటీల చైర్మన్లు తమ పదవులకు రాజీనామా చేశారు. విశాఖ స్మార్ట్ సిటీ ఛైర్మన్ జి.వెంకటేశ్వర రావు, కాకినాడ స్మార్ట్ సిటీ చైర్మన్ ఏ.రాజు బాబు, ఏలూరు స్మార్ట్ సిటీ ఛైర్ పర్సన్ బి.అఖిల, తిరుపతి స్మార్ట్ సిటీ ఛైర్ పర్సన్ ఎన్. పద్మజలు తమ పదవులకు రాజీనామా చేశారు. సాంకేతికంగా స్మార్ట్ సిటీ మిషన్లకు నామినేటెడ్ నియామకాలు చెల్లవని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ఏపీ ప్రభత్వానికి లేఖ రాసింది. దీంతో తక్షణం రాజీనామాలు చేయించాలని గత డిసెంబర్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ లేఖ రాసింది. కేంద్ర ప్రభుత్వ రాసిన లేఖ మేరకు రాష్ట్రంలో స్మార్ట్ సిటీ మిషన్ చైర్మన్లతో ప్రభుత్వం రాజీనామాలు చేయించింది. ఈమేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## టీడీపీ వాళ్ళు శాసనసభ్యులా?... ఇంత గాలిగా వ్యవహరిస్తారా?: పేర్నినాని



అమరావతి: టీడీపీ సభ్యులపై మంత్రి పేర్నినాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ సభా సమయాన్ని వృధా చేస్తుందన్నారు. స్పీకర్‌పైన ఆకతాయితనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ వాళ్ళు శాసనసభ్యులా? ఇక్కడికి వచ్చిఏమిచేద్దాంఅనుకుంటున్నారనిప్రశ్నించారు.ఇంతగాలిగా వ్యవహరిస్తారా?అంటూ దుయ్యబట్టారు.గాలితనం చేయడం...మళ్ళీ బొంకడం టీడీపీ నేతలకే చెల్లుతుందని అన్నారు. కొత్తపల్లి సుబ్బారాయుడు వైసీపీని గెలిపించి తప్పు చేశామని మాట్లాడితే దానిని ఖండిస్తున్నామన్నారు. భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయడం ఇష్టం లేకపోతే సీఎం జగన్‌కు తన అభిప్రాయాలు చెప్పవచ్చని అన్నారు. నర్సాపురం ఎమ్మెల్యేను రాజకీయంగా బదనామ్ చేద్దామని బురద జల్లడం కరెక్ట్ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుబ్బారాయుడు చెప్పుతో కోట్టుకోవాలి అంటే చాలా సార్లు కొట్టుకోవాలని మంత్రి పేర్నినాని వ్యాఖ్యలు చేశారు.




# సంపాదకీయం

బుధవారం 23 మార్చి 2022

## నినాదాలు కాదు..నిర్దుష్టమైన విధానాలు కావాలి

ఒక విధంగా చూస్తే కేవలం మోడీ ప్రభుత్వం మాత్రమే కాకుండా 1991 నుండి నూతన ఆర్ధిక విధానాల పేరుతో కేంద్రంలోని ప్రభుత్వాలు వరుసగా అనుసరిస్తున్న ఆర్ధిక విధానాల పట్ల ఆర్ఎస్ఎస్ తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉంది. పివి నరసింహారావు నుండి నరేంద్ర మోడీ వరకూ అనుసరిస్తున్న ఆర్ధిక విధానాలలో తీవ్రత, అమలు స్వభావంలో తేడాలు ఉన్నప్పటికీ మౌలికమైన సూత్రాలలో తేడాలు లేకపోవడం తెలిసిందే. కీలక రంగాలలో విదేశీ పెట్టుబడులను అనుమతించడం, లాభదాయకమైన ? కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పచెప్పడం, చిన్న, సన్నకారు పరిశ్రమలకు విఘాతం కలిగించే విధానాలు అమలు పరచడం, గ్రామీణ- వ్యవసాయ రంగాలను నిర్లక్ష్యం చేస్తుండడం పట్ల మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ అసహనం వ్యక్తం చేస్తూనే ఉంది.ప్రభుత్వాలు భారతీయ విలువలతో కూడిన ఆర్ధిక నమూనాలను అనుసరించాలని, భారతదేశ సామాజిక నిర్మాణాన్ని, గ్రామీణ జీవితాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ ఎల్లప్పుడూ నమ్ముతుంది. దత్తోపంత్ తెంగడి ప్రముఖులు భారతీయ ఆర్ధిక వ్యవస్థకు అత్యంత అనుకూలమైన స్వదేశీ నమూనాను స్థిరంగా వ్యక్తీకరించారు. 1990ల ప్రారంభంలో ఆర్ధిక వ్యవస్థ సరళీకరణ తరువాత, ఆర్ఎస్ఎస్ అటువంటి నమూనా కోసం తీవ్రంగా కృషి చేస్తూ వస్తున్నది. 1992లో భారత ఆర్ధిక వ్యవస్థ ప్రారంభమైనప్పుడు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సభ 'స్వదేశీ', 'నిరుద్యోగం' పై ఒక తీర్మానాన్ని ఆమోదిస్తూ దాదాపు ఇతరులపై ఆధారపడటం పెరుగుతూ ఉండడం ఆర్ధిక బానిసత్వానికి, భారీ నిరుద్యోగానికి తీస్తుందని హెచ్చరించింది. మూలధన ఆధారిత, ఉపాధి అవకాశాలు తగ్గించే సాంకేతికత ఆధారంగా హైబ్రిడ్ సోవియట్-పాశ్చాత్య నమూనా తర్వాత మన ఆర్ధిక అభివృద్ధిని రూపొందించే ప్రయత్నాలను నేరుగా గుర్తించవచ్చని తెలిపింది.మన మేధో సంపత్తిని, మన జీవిత విలువలను, ప్రస్తుత పరిస్థితులు, అవసరాలు, మన ప్రజల భవిష్యత్తు ఆకాంక్షలను విస్మరించడం కాగలదని హెచ్చరించింది. వాజపేయి హయాంలో దత్తోపంత్ తెంగేది వంటి వారు ధర్నాలు కూడా చేయడంతో విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ముఖ్యంగా దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం పట్ల ప్రస్తుత తీర్మానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మోడీ ప్రభుత్వం చెబుతున్న 'ఆత్మనిర్భర్ భారత్'ను స్వాగతిస్తూనే అందుకు విదేశీ అనుకరణ విధానాలు కాకుండా భారతీయ విలువలతో కూడిన 'భారతీయ నమూనా' అనుసరించాలని స్పష్టం చేసింది. ఆ నమూనా ఏ విధంగా ఉండాలో కూడా ఒక ఆలోచన కలిగించే ప్రయత్నం చేసింది. ఈ తీర్మానం గ్రామీణ ఉపాధి, అసంఘటిత రంగంలో, మహిళా ఉపాధి వంటి అంశాలను నిరుద్యోగ సమస్య పరిష్కారంకు మార్గంగా చూపింది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా దేశంలో ఉత్పత్తి రంగంలో పురోగతి లోపించడం ఉపాధి అవకాశాలు తగ్గిపోవడానికి, అనుకున్న రీతిలో వృద్ధి సాధించలేక పోవడానికి ప్రధాన కారణాలుగా గుర్తు చేసింది.మన సామాజిక పరిస్థితులకు అనువైన నూతన సాంకేతికతలను, తగిన సాఫ్ట్ స్కిల్స్‌ను అనుసరించాలని సూచించింది. అదే విధం గా ఈ లక్ష్య సాధనలో కేవలం ప్రభుత్వమే కాకుండా సమాజం కూడా తనవంతుగా కృషి చేయాలని, యువత కూడా ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా స్వయం ఉపాధికి ప్రయత్నం చేయాలని ఆర్ఎస్ఎస్ సూచించింది. నేడు దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడానికి అనాలోచితంగా చేసిన నోట్ల రద్దు, కరోనా మహమ్మారితో స్తంభించిపోయింది. ఆర్ధికాభివృద్ధి ప్రధాన కారణం అయినప్పటికీ, మౌలికంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్ధిక విధానాలు కూడా అనే అంశాన్ని పరోక్షంగా ఈ తీర్మానం గుర్తు చేసిన్నట్లు కనిపిస్తున్నది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ డేటా ప్రకారం, నిరుద్యోగిత రేటు 2018-19లో 6.3%, 2017-18లో 4.7% నుండి 2021 డిసెంబర్‌లో 7.91%కు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో, ఇది జనవరి 2021లో 8.09% నుండి డిసెంబర్ 2021లో 9.30%కు, గ్రామీణ ప్రాంతాల్లో 5.81% నుండి 7.28%కు పెరిగింది. తయారీ రంగం 2019-20 నుండి డిసెంబర్ 2021 మధ్య 9.8 మిలియన్ల ఉద్యోగాలను కోల్పోయింది. 'ఉపాధి కల్పన సమస్యపై ప్రభుత్వాన్ని నిందించడం సులభమే. కానీ సమాజంలో నెలకొన్న బలాన్ని ఉపయోగించకుండా, ఉపాధిని సృష్టించడం సాధ్యం కాదు. ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని అంతం చేయగలిగితే, ఎక్కడా నిరుద్యోగం ఉండదు. కాబట్టి స్వావలంబి భారత్ అభియాన్ పేరుతో ప్రచారం ప్రారంభించాము అని ఆర్ధిక విధానాలపై ఆర్ఎస్ఎస్ అభిప్రాయాలను తరచూ స్పష్టం చేస్తుండే స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో- కన్వీనర్ అశ్వనీ మహాజన్ తెలిపారు.ఉపాధి కల్పనను వికేంద్రీకరించడానికి, అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడానికి ఒక ప్రయత్నం జరగాలని, తద్వారా ఉపాధి అంతా కొన్ని నగరాల్లో కేంద్రీకృతమై ఉండరాదని మహాజన్ భావిస్తున్నారు. 'ఈ తీర్మానంలో ఈ ఆలోచనను పొందుపరుస్తున్నది. యువత వ్యవస్థాపకత మన బలం. అలాంటప్పుడు కేవలం ఉద్యోగాల ద్వారానే ఉపాధి ఉండాలని ఎందుకు అనుకోవాలి? 60-70 ఏళ్ల ఈ ఆలోచన మారాలి' అని మహాజన్ స్పష్టం చేశారు. ఉత్పాదక రంగంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతు ఇచ్చేలా ప్రభుత్వంపై వత్తిడి తేవడం, 'వ్యవసాయ -అనుబంధ కార్యకలాపాలు, ఇతర స్వయం ఉపాధి అవకాశాల ద్వారా వ్యవస్థాపక వ్యాపారాలలో నిమగ్నమవ్వడంలో వారికి సహాయపడటానికి 'అట్టడుగు స్థాయి యువతతో కలిసి పని చేయడం ద్వారా ఆర్ఎస్ఎస్ ఈ లక్ష్య సాధనలో పని చేసేందుకు కృషి చేస్తున్నది. మన తయారీ రంగం జిడిపిలో 17- 18% ఉండేది. ఇప్పుడు అది 15% కు తగ్గింది. మహమ్మారి కారణంగా ప్రభుత్వ ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. చైనాపై ఆధారపడటం నానాటికీ తగ్గిపోతోంది. టారిఫ్ అడ్డంకులు సహా వివిధ మార్గాల ద్వారా తయారీని పెంచడానికి ప్రభుత్వం చాలా చేసింది. ఇప్పుడు సమాజం కూడా అందుకు తగ్గట్టుగా ఎదగాలి" అని మహాజన్ సూచించారు.ఆర్ఎస్ఎస్, పరివార్‌లో ఆర్ధిక విధానాలపై ఆలోచనలు చేస్తున్న స్వదేశీ జాగరణ్ మంచ్‌తో పాటు బిఎంఎస్, కిసాన్ సంఘ్ వంటి ఐదు స్వతంత్ర సంస్థలు ఉన్నాయి. వీరంతా కర్ణావతిలో జరిగిన ప్రతినిధుల సమావేశాలకన్నా ముందు ఒక రోజంతా సమావేశమై దేశ ఆర్ధిక విధానాలు, దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్ధిక పరిస్థితుల గురించి సమాలోచనలు జరిపినట్లు తెలుస్తున్నది. ఈ సందర్భంగా ఆందోళనల నుండే ఈ తీర్మానం వెలువడినట్లు కనిపిస్తున్నది. గల్వాన్ లోయలో ఘర్షణ అనంతరం చైనా నుండి దిగుమతులను తగ్గిస్తూ, 'భారత్‌లో తయారీ' ని ప్రోత్సహిస్తున్నట్లు భారత ప్రభుత్వం విశేషంగా ప్రచారం చేస్తున్నా ఆచరణలో చైనాపై ఆధారపడటం పెరుగుతున్నది.

# డైవర్షన్ పాలిటిక్స్ లో పార్టీలు

విజయవాడ, మార్చి 22,ఆంధ్రప్రదేశ్‌లో దేశంలో ఎక్కడా లేని విధంగా, ఏక పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ నడుస్తోందా? అధికార పార్టీ, ఆడింది ఆట, పాడింది పాట అన్నట్లుగా, శాసనసభ కార్యకలాపాలు సాగుతున్నాయా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. అధికార వైసీపీ సభ్యులు సభలో వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలను పాతరేసే విధంగా ఉందని, ఎవరో కాదు, ఆ పార్టీ నాయకులే, సభ బయట వ్యక్తిగత సంభాషణల్లో ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. గత వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సభలో కన్నీరు పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటే, అంతకు మించి సభ జరుగుతున్న తీరుకు వేరే తిప్పని అవసరం లేదు. నిజానికి, చంద్రాబాబు నాయుడు సభలో తమకు జరిగిన అవమానానికి కలత చెంది, కన్నీరు పెట్టుకున్న తర్వాత అయినా అధికార పార్టీ సభ్యుల ప్రవర్తనలో లేదా ప్రభుత్వం సభను నిర్వహిస్తున్న తీరులో గానీ, ఏమైనా మార్పు వచ్చిందా, అంటే అదీ లేదు. సభలో ప్రతిపక్షమే ఉండకూడదు, అనే విధంగా, వరసగా గత ఐదు రోజులుగా, ప్రతిపక్ష తెల్గుసు దేశం సభ్యులను, ఏ రోజుకు ఆ రోజు సభ నుంచి సస్పెండ్ చేయడం జరుగుతోంది. రాష్టంలో కల్తీ సార తగి 18 మంది చనిపోతే, దాని పై సభలో చర్చజరగ కుండా చేయడమే కాకుండా,అవన్నీ సహజ మరణాలని బుకాయించే ప్రయత్నం చేయడం, ప్రజస్వామ్యాన్ని పరిహరించడమే అవుతుందని, అంటున్నారు. నిజానికి కల్తీ సారా, మద్యం కారణంగా రాష్ట్రంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తెలుదు దేశం, ఇతర ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అంతే కాదు, నాటుసారా మరణాలపై నుంచి దృష్టి మళ్లించేందుకే, అసెంబ్లీలో పెగాసెస్ అంశాన్ని చర్చకు తీసుకొచ్చారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. అదలా ఉంటే,వరుసగా ఐదో రోజూ.. అసెంబ్లీ నుంచి తమను సస్పెండ్ చేయటం దుర్మార్గమని తెదేపా నేతలు మండిపడ్డారు. నాటుసారా మరణాలపై నుంచి దృష్టి మళ్లించేందుకే.. ఏపీ అసెంబ్లీలో పెగాసెస్ అంశాన్ని చర్చకు తీసుకొచ్చారని విమర్శించారు. నాటుసారా మరణాల పై నుంచి దృష్టి మళ్లించేందుకే.. ఏపీ అసెంబ్లీలో పెగాసెస్ అంశాన్ని చర్చకు తీసుకొచ్చారని తెదేపా ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. వరుసగా అయిదో రోజూ.. అసెంబ్లీ నుంచి తమను సస్పెండ్ చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. పార్లమెంటులో పెగాసస్‌పై చర్చ వద్దన్న వైకాపా.. అసెంబ్లీలో మాత్రం చర్చకు పట్టుపడుతోందని ఎద్దేవా చేశారు. అధికారం ఉంది కనుక..పెగాసస్‌పై దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చి ప్రజల ముందుంచాలని సవాల్ చేశారు. చంద్రబాబు మీద బురద జల్లడానికే.. మమత బెనర్జీతో ఫేక్ మాటలు చెప్పించారని ఆరోపించారు. మద్యం, సారా కారణంగా రాష్ట్రంలో వెయ్యిమందికి పైగా చనిపోయారని నేతలు ఆరోపించారు. తాడేపల్లికి వచ్చే మద్యం ఆదాయం తగ్గుతుందనే.. పెగాసెస్ పై అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు.దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేనటువంటి బ్రాండ్స్ ఏపీలో ఉన్నాయి. మందు కాదు అది విషని, ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఆరోపించారు. రాష్టంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి పెగాసస్ అంశాన్ని శాసనసభలోకి తీసుకురావడం అత్యంత హేయమైన చర్య. దీనిని తెలుగుదేశం పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. నిజం. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, మద్యం పాలసీలో వచ్చిన మార్పులు, ప్రవేశ పెట్టిన దేశంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్స్' వలన సామాన్య ప్రజలు అనేఅక మంది అనారోగ్యం పాలయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు.

# కేబినెట్ విస్తరణపై మీ మాంసా...

విజయవాడ, మార్చి 22, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఈ అంశం చుట్టూనే రాజకీయ మీడియా వర్గాల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి.ముఖ్యంగా అధికార వైసీపీలో అయితే, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చుట్టూనే అందరి ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. సహజంగా మంత్రి వర్గ విస్తరణ అంటే, అందరిలోనూ కొత్తగా ఎవరిని అదృష్టం వరిస్తుంది, అనే ఆసక్తే కనిపిస్తుంది. అయితే, ఇప్పుడు చిత్రంగా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, కొత్తగా ఎవరికి అవకాశం కల్పిస్తారు అనేదాని కంటే, ప్రస్తుత మంత్రులో ఎంతమంది మిగులుతారు, ఎంతమంది మాజీలు అవుతారనే విషయంగానే ఎక్కువ ఆసక్తి ఎక్కువగా కనిపిస్తోంది. మరోవంక రోజులు దగ్గరయ్యేకొద్దీ, లెక్కలు మారుతున్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. దీంతో ఆశావహుల్లో ఆందోళన పెరిగి పోతోందని అంటున్నారు. మూడేళ్ళుగా మంత్రులుగా ఉన్న వారిలో ఎంతమంది మంత్రులుగా కొనసాగుతారు, ఎంతమందికి ముఖ్యమంత్రి ఉద్వాసన పలుకుతారు అనే విషయం పైనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముందుగా ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా అయితే, ప్రస్తుత మంత్రులు అందరూ ఇంటికి పోవలసిందే. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తొలి మంత్రివర్గం తొలి సమావేశంలోనే, రెండున్నరేళ్ల తర్వాత, ఫస్ట్ బ్యాచ్ మంత్రులు అందరూ, తప్పుకుని కొత్త వారికి అవాకాశం ఇవ్వాలని క్లియర్ కట్‌గా చెప్పారు. అయితే ఇప్పుడు కొందరు మంత్రులకు ముఖ్యమంత్రి మినహాయింపు ఇచ్చారని, ఆ విధంగా ఓ పది మంది వరకు మంత్రులు సెకండ్ బ్యాచ్' లోనూ కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు, నిజానికి, మొదట్లో మత్రులుగా కొనసాగే వారిలో బొత్స సత్యనారయణ, పెద్ది రెడ్డి వంటి కొద్దిమంది సీనియర్ల పేర్లు మాత్రమే వినిపించాయి. అయితే, రోజులు గడిచే కొద్దీ, కొనసాగే మంత్రుల సంఖ్య పెరుగుతోందని అంటున్నారు. మొత్తం 25 మంది మంత్రులలో, ఐదారుగు మాత్రమే వడపోతలు మిగులుతారని. మిగిలిన అందరికీ, ఉద్వాసన తప్పదని అనుకుని అనేక మంది ఆశలు పెంచుకున్నారు.దీంతో, ఆశావహుల్లో నిరాశ తొంగిచూస్తోందని అంటున్నారు. మరోవంక ఆశావహులు, ఎక్కేగడప,దిగేగడప అన్నట్లుగా కీలక నేతల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి మనసులో ఏముందో ఎవరికీ తెలియదని, ఇతవరకు ఆయన ఒకరిద్దరు మినహా మరెవరితోనూ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ గురించి, మాట్లాడలేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ ఒకరిద్దరితో కూడా క్లుప్తంగా మాట్లాడారే కానీ, తమ మనసులో ఏముందో బయట పెట్టలేదని అంటున్నారు. అదలా ఉంటే, వేకెన్సీలు ఎన్ని ఉంటాయో ఏమో తెలియక పోయినా, శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఏ జిల్లా తీసుకున్నా, ఇద్దరు అంతకంటే ఎక్కువమందే ఆశలు పెట్టుకున్నారు.అలాగే, మంత్రి పదవులు ఆశిస్తున్న వారిలో స్పీకర్ తమ్మినేని సీతారామ్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కొలుసు పార్థసారధి, మాజీ చీఫ్ విప్ సామినేని ఉదయభాను, ఇంకా చాలా మందే ఉన్నారు. అయితే చివరకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఏమి చేస్తారో , ఎవరిని అందలం ఎక్కిస్తారో, ఎవరికి నెక్స్ట్ టైమ్' బెటర్ లక్' అని పక్కన పెడతారో ఎవరికీ అంతుచిక్కడం లేదని అంటున్నారు. అన్నిటినీ మించి ఆశావహులు ఆశిస్తున్నట్లుగా, మంత్రి వర్గ విస్తరణ ఉగాదికి ఉంటుందా,జూలై వరకు ..వాయిదా వేస్తారా ..అనేది ఇంకా తేలవలసే వుంది.

# వివేకా కేసులో అడ్డంకులు

కడప, మార్చి 22, (ప్రత్యర్థిని నేరుగా ఢీకొట్ట లేనప్పుడు.. ఆ వ్యక్తికి మద్దతిస్తున్న వారిని బెదిరించు' ఇది పూర్వీకులు చెప్పిన మాట. అంటే మన శత్రువును ఓడించాలంటే.. ఆ శత్రువుకు ఎవరి మద్దతు ఉందో, ఎవరి తోడ్పాటుతో మన మీదకు కాలుదువ్వుతున్నాడో గ్రహించాలన్నమాట. అలా మద్దతిచ్చే వ్యక్తిని మన ప్రత్యర్థికి దూరం చేస్తే.. సగం విజయం సాధించినట్లే అనేది వారు చెప్పిన మాట. ఏపీ సీఎం జగన్ బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఒక్కొక్క రహస్యాన్ని ఛేదిస్తున్న సీబీఐ అధికారుల మీద కేసులు పడుతున్నవైనం పూర్వీకుల మాటను అక్షరాలా పాటిస్తున్నట్లు కనిపిస్తోందంటున్నారు విశ్లేషకులు.వివేకా హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రామ్ సింగ్ పై పులివెందుల బాకరాపురానికి చెందిన ఉదయ్ కుమార్ రెడ్డి ఫిబ్రవరి 15న ఏఆర్ అడిషినల్ ఎస్పీ మహేశ్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. వివేకా మర్డర్ కేసుకు సంబంధించి తనకు తెలిసిన విషయాన్నీ చెప్పినా సీబీఐ అధికారులు పట్టించుకోలేదని, తాము చెప్పినట్లు వినాలని తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించడమే కాకుండా కడప కోర్టులో పిటిషన్ వేశాడు. ఉదయ్ కుమార్ రెడ్డి ఫిర్యాదుతో సీబీఐ అధికారి రామ్ సింగ్ పై కేసు నమోదు చేయాలని ఫిబ్రవరి 18న కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఐపీసీ 195ఏ, 323, 506 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద రిమ్స్ సీఐ సదాశివయ్య కేసు నమోదు చేశారు.అంతకు ముందు.. వివేకా హత్య కేసులో సీబీఐ తనకు 10 కోట్ల రూపాయలు ఆఫర్ చేసిందంటూ అనంతపురం జిల్లా యాడికికి చెందిన గంగాధర్ రెడ్డి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడం గమనార్హం. వివేకా హత్య కేసును తాను ఒప్పుకోవాలని సీబీఐ ఈ ఆఫర్ చేసిందని, వివేకా అనుచరుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని ఎస్పీకి గంగాధర్ రెడ్డి ఫిర్యాదు చేశాడు. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శంకర్ రెడ్డి పాత్ర ఉందని సాక్ష్యం చెప్పాలని, లేదంటే ఆ హత్య తానే చేసినట్లు ఒప్పుకోవాలని సీబీఐ తనపై ఒత్తిడి చేసిందని గంగాధర్ రెడ్డి ఫిర్యాదు చేయడం విశేషం.గంగాధర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి తమ డిపార్ట్ మెంట్ పైనే కేసులు వేయడం వెనుక ఎవరి హస్తమో ఉండి ఉంటుందని సీబీఐ అధికారుకు అనుమానం వచ్చినట్లు తెలుస్తోంది. ఆ క్రమంలోనే వారు చాప కింద నీరులా ఫిర్యాదు చేసిన వెనక ఉన్నది ఎవరనేది కూపీ లాగినట్లు తాజాగా అందుతున్న సమాచారం. వివేకా హత్య కేసులో అప్రూవర్ గా మారిన నిందితుడు దస్తగిరి, వివేకా కుమార్తె సునీత, వివేకా అల్లుడు రాజశేఖర్ రెడ్డి, అప్పటి పులివెందుల సీఐ శంకరయ్య, ఇంటి పనిమనిషి రంగయ్య తదితరులు ఇచ్చిన వాంగ్మూలాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే వారి చేత సీబీఐ అధికారుల మీద కేసులు వేయించినట్లు తెలుసుకున్నారట.వివేకా హత్యకు స్కెచ్ వేసిన వారు, హత్యలో స్వయంగా పాల్గొన్నవారు, హత్యానంతరం ఆధారాలను తుడిపించి, ఆనవాళ్లు లేకుండా చేయించిన వారు, గుండెపోటుతో వివేకా మరణించారంటూ మీడియా ద్వారా లీకులు ఇచ్చి ప్రచారం చేసిన వ్యక్తులే ఇలా గంగాధర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి చేత కేసులు వేయించినట్లు సీబీఐ కూపీ లాగారని తెలుస్తోంది. దాంతో పాటుగా వైఎస్ వివేకా రాజకీయంగా తన ఎదుగుదలకు అడ్డొస్తున్నారనే అక్కసుతో ఆయన మర్డర్ కు స్కెచ్ వేసిన వ్యక్తే వీరిని ఉసిగొలిపి ఎదురు కేసులు వేయించినట్లు సీబీఐ విచారణలో తెలుసుకున్నట్లు సమాచారం. అలా ఉల్టా తమపైనే కేసులు వేయించడం వెనుక ఉద్దేశం సుస్పష్టం అని సీబిఐ భావిస్తోందట. కేసులు వేయించడం ద్వారా సీబీఐ అధికారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, కేసు దర్యాప్తు వేగాన్ని తగ్గించడం, విచారణ మరి కొంతకాలం ఆలస్యం చేయించడమే నిందితుల ఉద్దేశం అని సీబిఐ గుర్తించిందని సమాచారం. సీబీఐ అధికారుల మీదే కేసులు పెట్టించడం అంటే.. వివేకా హత్య కేసులో వారు వేగం పెంచకుండా నిరోధించడమే లక్ష్యంగా గంగాధర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి చేత నిందితులు కేసులు వేయించినట్లు చెబుతున్నారు.ఏదేమైనా వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తుది దశకు చేరిందని తెలుస్తోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలకు నోటీసులు ఇచ్చేందుకు సీబీఐ అధికారులు ప్రయత్నిస్తే.. వాటిని తీసుకునేందుకు తిరస్కరించారు. దీంతో సీబీఐ అధికారులు కడప కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎంపీ కనుక ఆయన అరెస్ట్ కోసం సీబీఐ అధికారులు లోక్ సభ స్పీకర్ కు సమాచారం ఇచ్చారని, త్వరలోనే సీబీఐ ఉన్నతాధికారులు ఆయనను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయంటూ మీడియాలో వార్తలు వస్తుండడం గమనార్హం.

# 2024 అంత ఈజీ కాదా...


గుంటూరు, మార్చి 22, 2019 ఎన్నికలకు ఈసారి జరగబోయే ఎన్నికలకు పొలిటికల్ సీన్ పూర్తిగా మారుతుంది. ప్రధానంగా జగన్ పార్టీ విషయంలో రివర్స్ అవుతుంది. గత ఎన్నికల్లో శత్రువులు ఉన్నా వారు విడివిడిగా పోటీ చేయడం జగన్ కు అడ్వాంటేజీగా మారింది. కానీ ఈసారి శత్రువులంతా ఏకమై జగన్ ను టార్గెట్ చేసే అవకాశాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఇంటా, బయటా ఈసారి శత్రువులు జగన్ కు మరింత ఎక్కువ కానున్నారు. కుటుంబంలోనే.... జగన్ కు సొంత కుటుంబంలోనే వ్యతిరేకత ఉంది. తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల వచ్చే ఎన్నికలకు దూరంగా ఉంటారు. జగన్ కూడా వారి సాయాన్ని కోరే ఆలోచనలో లేరు. వైఎస్ కు సన్నిహితులైన ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి నేతలు కూడా ఈసారి జగన్ కు సాయం చేయకపోగా అవసరమైతే నాలుగు రాళ్లు వేయడానికి సిద్ధమవుతారన్నది వాస్తవం. రాజకీయంగా ఎంతమంది శత్రువులను అయినా ఎదుర్కొనవచ్చు. కానీ కుటుంబంలో తలెత్తిన విభేదాలు జగన్ పాలన మీద కాకుండా వ్యవహారశైలికి మచ్చ తెచ్చే విధంగా ఎన్నికల సమయానికి మారతాయి.గత ఎన్నికల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రకాలుగా సాయం చేశారన్న టాక్ అయితే ఉంది.ఈసారి జగన్ కు కేసీఆర్ మద్దతు దొరికే అవకాశం లేదు. గత ఎన్నిలకు ఈసారి ఎన్నికలకు జగన్ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారబోతుంది. గత ఎన్నికల్లో జగన్ పట్ల ప్రజల్లో సాను భూతి ఉంది. ఒంటరి వాడిని చేసి కేసులు పెట్టారన్న బాధ ప్రజల్లో ఉంది. పాదయాత్ర అందుకు తోడయింది. దీంతో వ్యక్తిగత ఇమేజ్ తోనే జగన్ 151 స్థానాలను పార్టీకి సాధించిపెట్టగలిగారు. ఈసారి ప్రజలకు దూరంగా ఉంటున్నారు.. ఈసారి వాటిలో ఏదీ పనిచేయని పరిస్థితి. ఐదేళ్లు అధికారంలో ఉండటంతో పాత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ప్రజలు బేరీజు వేసుకుం టారు. ఈసారి సామాజికవర్గాల సమీకరణాలు కూడా పెద్దగా పనిచేయక పోవచ్చు. గంపగుత్తగా ఒకే సామాజికవర్గం నేరుగా జగన్ కు ఓటేసే అవకాశాలు కన్పించడం లేదు. ఆయన సొంత సామాజికవర్గంలోనూ అసంతృప్తి కనిపిస్తుంది. మొత్తం మీద జగన్ కు ఈసారి ఎన్నికలకు అంత సులువు కాదు. జగన్ కు శత్రువుల సంఖ్య పెరిగిందని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు.

## లిథియం బ్యాటరీతోనే సమస్య

నెల్లూరు, మార్చి 22, పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అదుపుచేసేందుకు ప్రపంచమంతా విద్యుత్ వాహనాల వినియోగానికి మొగ్గు చూపుతోంది. 2040 నాటికి ప్రపంచంలోని పాసింజర్ వెహికిల్స్‌లో మూడింట రెండొంతులు విద్యుత్ వాహనాలే ఉంటాయని 'బ్లూమ్‌బర్గ్' అనే అంతర్జాతీయ మీడియా సంస్థ అంచనా వేసింది. మన దేశంలోనూ కేంద్ర ప్రభుత్వం 2070 నాటికి కర్బన ఉద్గారాలు సున్నాకు చేరేలా ప్రయత్నాలు చేస్తోంది. విద్యుత్ వాహనాల కోసం జాతీయ రహదారుల వెంబడి విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు మన రాష్ట్రం సన్నాహాలు చేస్తోంది.బ్యాటరీ స్టోరేజ్ సాంకేతికతలు అభివృద్ధి చెందుతుండడంతో విద్యుత్ నిల్వ వ్యవస్థలూ పెరుగుతున్నాయి. విశాఖలోనూ బ్యాటరీలతో విద్యుత్ నిల్వ చేసే ప్రాజెక్టుల స్థాపనకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ నిల్వ, వాహనాలు నడిచేందుకు ప్రధానాధారమైన బ్యాటరీలు ప్రస్తుతానికి ఖరీదైనవే కాకుండా రీసైక్లింగ్‌కు కష్టతరమవుతుండటంపై ఇప్పుడు చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల్లో ఎక్కువగా లిథియం అయాన్ బ్యాటరీలను వినియోగిస్తున్నారు. కానీ, సాధారణ బ్యాటరీలను రీసైకిల్ చేసేందుకు ఉపయోగించే పద్ధతులు లిథియం బ్యాటరీ విషయంలో పనిచేయవు. లిథియం బ్యాటరీలు సాధారణ బ్యాటరీల కంటే పెద్దవి. వీటి నిర్మాణం సంక్లిష్టంగా ఉండటమే కాకుండా రీసైక్లింగ్‌లో ఏ మాత్రం తేడా జరిగినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వీటిని ల్యాప్‌టాప్స్, వాహనాలు, పవర్ గ్రిడ్స్ వంటి అనేక రంగాల్లో వినియోగిస్తున్నారు.సాధారణంగా రీసైక్లింగ్ ప్లాంట్లలో బ్యాటరీ భాగాలను చూర్ణం చేస్తారు. ఆ చూర్ణాన్ని అలాగే కరిగించడం(పైరోమెటలర్జీ) లేదా, యాసిడ్‌లో కరిగించడం(హైడ్రో మెటలర్జీ) చేస్తారు. కానీ లిథియం బ్యాటరీలను అలా చేయడం సాధ్యం కాదు. అంతేకాదు రీసైక్లింగ్‌లో తిరిగి ఉపయోగించేందుకు పనికొచ్చే ఉత్పత్తుల విలువ కంటే రీసైక్లింగ్ ప్రక్రియకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువ. దీంతో 5 శాతం లిథియం బ్యాటరీలు మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నాయి. ఒక టన్ను లిథియం తవ్వాలంటే 5 లక్షల గ్యాలన్ల(సుమారు 22,73,000 లీటర్ల) నీరు అవసరం. అలాగే పదేళ్ల తర్వాత.. వాడేసిన కోట్లాది లిథియం బ్యాటరీలను సమర్థంగా రీసైకిల్ చేసే వ్యవస్థలుండాలి. దీంతో లిథియం బ్యాటరీల రీసైక్లింగ్‌కు పర్యావరణ అనుకూల, తక్కువ ఖర్చు, సులభ పద్ధతుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో వైపు లిథియం బ్యాటరీలు కాకుండా.. పర్యావరణ అనుకూల బ్యాటరీలను తయారు చేసేందుకు మరికొన్ని ప్రయాత్నాలు జరుగుతున్నాయి.సేంద్రియ పదార్థాలను సింథసైజ్ చేసి ఎలక్ట్రాన్‌లను పుట్టించేలా ఆర్గానిక్ రాడికల్ బ్యాటరీ(ఓఆర్‌బీ)లను తయారు చేస్తున్నారు. 2025 సంవత్సరం చివరికల్లా లక్షలాది ఎలక్ట్రానిక్ వెహికిల్ బ్యాటరీల జీవిత కాలం ముగుస్తుంది. అప్పటిలోగా వాటిని సమర్థంగా రీసైక్లింగ్ చేయగలిగే విధానాలను గాడిలో పెట్టడంతో పాటు ఆర్గానిక్ బ్యాటరీలు అందుబాటులోకొస్తే విద్యుత్ వాహనాలకు రవాణా రంగంలో తిరుగుండదు

# బద్వేల్ లో కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వ నమోదు...

బద్వేలు బద్వేల్ టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత రాజు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు హాజరయ్యారు.ముందుగా జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పార్టీ నేతలను ఆన్లైన్ ద్వారా సభ్యులుగా నమోదు చేశారు.అనంతరం నేతలు బద్వేలు పురవీధులలో ప్రజల చేత కాంగ్రెస్ సభ్యత్వ నమోదు చేయించారు.కాంగ్రెస్ పార్టీ హయాంలో పెట్రోల్ ధర కేవలం 60 రూపాయలు ఉండేదని, డీజిల్ ధర కేవలం 48 రూపాయలు ఉండేదని, ప్రస్తుతం పెట్రోల్ 110 రూపాయలు, డీజిల్ నూరు రూపాయలు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వంట గ్యాస్ ధర కేవలం 400 రూపాయలు ఉండేదని, నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో వంటగ్యాస్ ధర వెయ్యి రూపాయలు అయ్యిందని, మహిళలు వంట చేయాలి అంటే ఇబ్బందులు పడుతున్నారని , విద్యార్థులు మోటార్ సైకిల్ తీయాలంటే బాధపడుతున్నారని, రైతులు ట్రాక్టర్లు తో సేద్యం చేయాలంటే భయపడుతున్నారని అన్నారు. వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు.నరేంద్ర మోడీ బూటకపు మాటలతో ప్రజలను మభ్య పెట్టడం తప్ప, ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు.రాయలసీమకు ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు.కడప ఉక్కు ఫ్యాక్టరీ కాంగ్రెస్ ప్రభుత్వం ,చట్టం లో పెడితే, దానిని కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు.2024లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే కేంద్రంలోనూ మరియు రాష్ట్రంలోనూ ప్రజలకు మేలు జరుగుతుందని వారు సూచించారు.



# నల్లారి బ్రదర్స్ మధ్య పొలిటికల్ వార్



తిరుపతి, మార్చి 22, ( ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో ఆయనకో ప్రత్యేకత ఉంది. సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ ఆయనదే కీ రోల్. అలాంటి నాయకుడు.. ఐదేళ్లుగా సొంతింటి గడప తొక్కట్లేదట? ఆ స్థాయి నాయకుడు ఇప్పుడెందుకిలా? కారణం ఏమయ్యుంటుంది? ఏపీ పొలిటికల్ కారిడార్‌లో ఇప్పుడు ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు నల్లారి కుటుంబం గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చిత్తూరు పాలిటిక్స్‌లో చక్రం తిప్పిన నల్లారి ఫ్యామిలీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా కీలక పదవుల్ని దక్కించుకుంది. నల్లారి అమర్నాథ్ రెడ్డి మంత్రిగా ఒక శకం నడిపిస్తే.. ఆయన కుమారుల్లో ఒకరైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏకంగా ఏపీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. అంతేకాదు, ఉమ్మడి ఏపీకి ఆఖరి ముఖ్యమంత్రిగా, సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలక నేతగా? పాలిటిక్స్ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పర్చుకున్నారు కిరణ్‌కుమార్ రెడ్డి.పొలిటికల్‌గా ఓ రేంజ్‌లో చక్రం తిప్పిన కిరణ్‌కుమార్‌రెడ్డి? ఇప్పుడు సొంత జిల్లాలో, అదీ.. సొంతూళ్లో సొంతింటికి వెళ్లలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారట. దానికి కారణం, తన తమ్ముడు నల్లారి కిశోరేనన్నది పొలిటికల్ టాక్. అన్న సీఎంగా ఉన్నప్పుడు జిల్లాలో పార్టీకి అన్నీ తానై వ్యవహరించిన కిషోర్ ఇప్పుడు.. టీడీపీలో ఉన్నారు. 2019లో ఆ పార్టీ తరపునే పీలేరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయినా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో.. ఏపీ రాజకీయాల్లో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నారు.అయితే, కిరణ్ మాత్రం రాష్ట్ర విభజన తర్వాత ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేకుండా ఉండిపోయారు. కీలక అనుచరులతో టచ్‌లో ఉంటున్నా పొలిటికల్‌గా యాక్టివ్‌గా ఉండటం లేదు. అయితే, జిల్లాకు రాకపోకలు సాగిస్తున్నా.. కలికిరి మండలంలోని సొంతూరు నగరిపల్లికి వెళ్లలేని పరిస్థితి ఆయనది. ఎందుకంటే, టీడీపీ కీలక నేతగా.. తన తమ్ముడు నల్లారి కిశోర్, ఆ ఇంటి నుంచే తన కార్యకలాపాలు సాగిస్తున్నారట. దీంతో, కాంగ్రెస్ కండువా వేసుకుని.. పసుపు జెండా పట్టుకున్న తమ్ముడి ఇంటికి వెళ్లడానికి కిరణ్ ఇష్టపడం లేదట. దీంతో, కలికిరి వచ్చినా.. అప్పట్లో సీఎంగా తాను కట్టించిన ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లోనే బసచేసి నేతలతో మాట్లాడి వెళ్లిపోతున్నారంట కిరణ్. తమ్ముడి తీరు వల్లే కిరణ్ ఐదేళ్లుగా సొంతూరి ముఖం చూడలేకపోతున్నారని పొలిటికల్ కారిడార్‌లో చర్చ జరుగుతోంది. గెస్ట్ హౌజ్‌కు కిలోమీటర్ దూరంలోనే ఉన్నా.. సొంతింటివైపు కిరణ్ కన్నెత్తి చూడటం లేదంటున్నారు స్థానికులు.నల్లారి సోదరుల మధ్య రాజకీయ విభేదాలతో.. నియోజకవర్గ కేడర్ కూడా రెండుగా చీలిపోయిందట. కిషోర్ టీడీపీలో కొనసాగుతున్నప్పటికీ.. కిరణ్ ముఖ్య అనుచరుల్లో చాలామంది ఆయన డైరెక్షన్‌లోనే నడుస్తున్నారట. అన్నదమ్ముల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో కుటుంబంలోనూ, బంధువుల్లోనూ చీలిక వచ్చిందట. సీఎంగా ఓ వెలుగువెలిగిన కిరణ్.. తమ్ముడు చేసిన నిర్వాకానికి సొంతూరికి దూరమయ్యారని స్థానికులు చర్చించుకుంటున్నారట. నల్లారి బ్రదర్స్ మధ్య ముదిరిన పొలిటికల్ వార్.. ఏ మలుపు తీసుకుంటుందన్నదే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది.

## అనంతలో కాల్వహావా...

అనంతపురం, మార్చి 22, (న్యూస్ పల్స్)లుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి కొందరు నేతలనే నమ్ముతున్నట్లు కనపడుతుంది. అనంతపురం జిల్లాలో పార్టీ విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. అక్కడ కమ్మ, రెడ్డి సామాజికవర్గాలు ఆధిపత్యం కోసం పట్టుబడుతున్నాయి. జేసీ బ్రదర్స్ దారి వేరు. జేసీ బ్రదర్స్ ను పరిటాల, ప్రభాకర్ చౌదరి వంటి నేతలు వ్యతిరేకిస్తున్నారు. వారు తమ నియోజకవర్గాలకే పరిమితమవ్వాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అనంతపురం జిల్లాలో కాల్వ శ్రీనివాసులుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనపడుతుంది. అనంతపురం జిల్లాలో గత ఎన్నికల్లో కేవలం రెండే స్థానాలు వచ్చాయి. వచ్చే ఎన్నికలలో కొద్దోగొప్పో రాయలసీమ జిల్లాల్లో సీట్లు గెలుచుకునే అవకాశం ఒక్క అనంతపురం జిల్లాలోనే చంద్రబాబుకు ఎక్కువగా కన్పిస్తుంది. ఇక్కడ పార్టీ క్యాడర్ బలంగా ఉండటమే కాకుండా, ఓటు బ్యాంకు కూడా సాలిడ్ గా టీడీపీకి ఉంది. అందుకే చంద్రబాబు ఈ జిల్లాలో ఎక్కువగా రిస్క్ చేయడానికి ఇష్టపడటం లేదు. కాల్వ శ్రీనివాసులు అయితే అందరినీ సర్దుబాటు చేసుకుంటూ వెళతారని నమ్ముతున్నారు. శింగనమల నియోజకవర్గంలోనూ దళితులకు, అగ్రవర్ణాలకు మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంది. అక్కడ రెండు గ్రూపులున్నాయి. ఇక కల్యాణదుర్గం నియోజకవర్గంలోనూ టీడీపీ లో రెండు గ్రూపులు బలంగా ఉన్నాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లె రఘునాథరెడ్డి, జేసీ వర్గాల మధ్య యుద్ధం నడుస్తూనే ఉంది. పెనుకొండలోనూ నిమ్మల కిష్టప్ప, బీకే పార్థసారధి వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంది. అనంతపురం టౌన్ లోనూ ప్రభాకర్ చౌదరి, జేసీ వర్గాలు సమయం కోసం వేచిచూస్తున్నట్లే కనపడుతున్నాయి. వీటన్నింటిని త్వరలోనే సెట్ రైట్ చేయాల్సి ఉంది. అందుకే ఎవరికి చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఒక్క కాల్వ శ్రీనివాసులుకు మాత్రమే నిర్ణయాధికారం ఇచ్చినట్లు కనపడుతుంది. ఆయన ద్వారానే చంద్రబాబు ఎప్పటికప్పుడు జిల్లా రాజకీయాలను తెలుసుకుంటున్నారు. కాల్వ శ్రీనివాసులుకు అధినేత ప్రయారిటీ ఇవ్వడం చూసిన కొందరు నేతలు ఆయనకు దగ్గరవుతుండగా, మరికొందరు కాల్వపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తం మీద అనంతపురం టీడీపీలో కాల్వ శ్రీనివాసులు కీలకంగా మారారనే చెప్పాలి.

## శ్రీశైలం వెళ్ళు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు

కౌతాళం శ్రీశైలం కి వెళ్ళు కర్ణాటక భక్తులకు రౌదూరు సమీపంలో లో వెలసిన అనాది బసవేశ్వర గుడిలో ఇడిగా రామ్మూర్తి కుమారులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.శ్రీశైలం లో వెలసిన భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వారి దర్శనానికి కర్ణాటక నుంచి వేలాదిమంది భక్తులు రౌదూర్ మీదుగా కౌతాళం ఉరుకుంద కోసిగి ఎమ్మిగనూరు మీదుగా వెళ్తారని వారికి ప్రతి సం అనాది బసవేశ్వర ఆలయం లో అన్నదాన కార్యక్రమలు నిర్వహిస్తామని ఇడిగా బసవరాజ్ ,నాగరాజు, శివ గౌడ్, తెలిపారు, భక్తులకు అన్నదాన కార్యక్రమలు నిర్వహించడం వల్ల సకల సంపదలతో కళకళలాడుతూ ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులు అందరూ బాగుంటారని పితృదేవతలు ఆశీర్వచనలు కలుగుతాయని అపారమైన నమ్మకం అని అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో మిన్న తెలిపారు. అక్కడే వెలిసిన దుర్గమ్మ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దగ్గరుండి కర్ణాటక నుంచి వచ్చే భక్తులకు ప్రసాదాలు అన్నదాన కార్యక్రమలు అందించారు వారికి నీటి సౌకర్యం విశ్రాంతి దేరాలు కల్పించారు.భక్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అగ్ని ప్రమాదంలో తల్లీకూతురుకు గాయాలు

ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన అగ్నిప్రమాదంలో తల్లి కూతురు తీవ్రంగా గాయపడ్డారు. కామవరపుకోట మండలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఫ్రిజర్ నుంచి మంటలు చెలరేగాయి.దీంతో అక్కడే ఉన్న సుబ్బలక్ష్మి ఆమె కుమార్తె ప్రసన్న ఇద్దరు మంటల్లో చిక్కుకున్నారు.మంటలు భారీగా వ్యాపించడంతో తీవ్రగాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

## బీసీలంతా ఐక్యమత్యంగా పోరాడి బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించాలి

**మత్స్యకారుల సంక్షేమంకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మత్సకారుల జీవనోపాధి పై దెబ్బతీసే 217 జీఓ ను రద్దు చేయాలి:– వై.నాగేశ్వరరావు యాదవ్**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్??రాష్ట్ర గొర్రెల పెంపకం దారుల ఫెడరేషన్ చైర్మన్?**

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి??ఈరోజు డోన్ లో సాయి ఫంక్షన్ హాల్ లో మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేసన్తున్న, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ**

**?జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ?రాష్ట్ర గొర్రెల పెంపకం దారుల ఫెడరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శివై.నాగేశ్వరరావు యాదవ్ గారు**

,పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ బిసి సెల్ అధ్యక్షులు మల్లికార్జున గారు, తెలుగుదేశం పార్టీ డోన్ మండలం అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్ గారు,జక్కసానికుంట్ల మహేష్ గారు, ఈశ్వరయ్య గారు,శ్రీను గారు,తిమ్మన గారు, ఎంపిటిసి సోమన్న గారు,రఘు గారు, ప్రకాష్ గారు, సోమశేఖర్ గారు, కృష్ణమూర్తి యాదవ్ గారు , మత్స్యకార సంఘం నాయకులు, మత్స్యకారులు,జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు,బీసీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ గారు మాట్లాడుతూ:–మత్స్యకారుల సంక్షేమంకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది.మత్స్యకారుల భవిష్యత్తు కోసం ఐక్యంగా పోరాడుదాం.మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాన్ని ముక్తకంఠంతో ప్రశ్నిద్దాం.మత్స్య కారుల కడుపు కొడితే చూస్తూ ఊరుకోం.రాష్ట్ర వ్యాప్తంగా 2800 సొసైటీలకు పొట్ట కొట్టే విధంగా లక్షలాది మంది మత్స్యకారులు రోడ్డున పడే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 217 రూపొందించింది.గతంలో ప్రభుత్వమే చేప పిల్లలను అందించేదని, వాటి పైన వచ్చిన సంపదను మత్స్యకారులు తీసుకునే వారు.ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక, మత్స్యకారులను పట్టించుకోకపోగా,మత్స్యకారుల సంపదను దళారులకు దొచిపెట్టే జీవోలను ప్రవేశపెడుతుంది. మత్స్యకారుల జీవన ఉపాధి పై 217 జీవో మత్స్యకారుల జీవనోపాధిని చిన్నాభిన్నం చేసింది. మత్స్యకారుల జీవన ఉపాధి పై దెబ్బతీసే ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాము.మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయం ప్రశ్నించేందుకై మనమందరం పోరు బాట పట్టాలి. మత్స్యకారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న అదేవిధంగా మత్స్యకారులకు వలలను, చేపలు తీసుకెళ్లేందుకై వాహనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి. భారతదేశంలో 56 శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజకీయంగా, సామాజికంగా విద్యాపరంగా,ఆర్థికపరంగా అన్ని రంగాలలో కూడా వెనకబడి ఉన్నాము.రాష్ట్ర ప్రభుత్వం బి సి ల సంక్షేమం కొరకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జరిగినది.కానీ కార్పొరేషన్లకు ఏర్పాటు చేసిన తర్వాత వీటికి నిధులుకానీ,విధులు కానీ కేటాయించడం లేదు. నాయకులు మాత్రం ఉత్సవ విగ్రహాల వలె వున్నారు. గత ప్రభుత్వంలో 13 జిల్లాల్లో 5 కోట్లతో బిసి భవనాలను ఏర్పాటు చేసారు.కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ భవనాలను పునాధులకే పరిమితం చేసి పట్టించుకునే పాపాన పోలేదు.50% పార్లమెంటు లో, అసెంబ్లీలో బీసీల కు సీట్లను కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.బీసీలంతా ఐక్యమత్యంగా పోరాడి బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించాలి.

## నకిలీ మస్కిటో రిపెల్లంట్

విజయవాడ, మార్చి 22, మస్కిటో రెపెల్లెంట్ ఆన్ చేశాం. ఇక దోమలు పరార్. హాయిగా నిద్రపోదాం అని అనుకున్నారా? అయినా దోమలు వదల బొమ్మాళీ అని గుయ్‌మంటూ ముసురుతూనే ఉంటున్నాయా? అయితే మీ మస్కిటో రెపెల్లెంట్‌ని అనుమానించకతప్పదు. అది నకిలీదేమో చూడండి. ఎందుకంటే నకిలీ మస్కిటో రీఫిల్ దందా ఒకటి బయటపడింది. ఎక్కడో చూడండి. కల్తీకేదీ కాదు అనర్హం అన్నట్లు రెచ్చిపోతున్నారు అక్రమార్కులు. మనం నిత్యం వాడే మస్కిటో రీఫిల్స్‌ను సైతం కల్తీ చేస్తున్నారు. అచ్చం ఒరిజినల్ రీఫిల్ మాదిరిగానే లిక్విడ్ నింపి మార్కెట్లో విక్రయిస్తున్నారు. సాధారణంగా నిత్యావసర వస్తువులు, తినుబండారాల్లో కల్తీ జరగడం చూస్తుంటాం. కానీ అక్కడ మాత్రం ఏకంగా దోమలు పోయేందుకు వాడే మస్కిటో రీఫిల్స్‌ను సైతం కల్తీ చేసేస్తున్నారు. విజయవాడ పాతబస్తీ పులిపాటివారి వీధిలో ఉన్న సాయి ధనలక్ష్మి ఫ్యాన్సీ షాపులో నకిలీ మస్కిటో రీఫిల్స్ బయటపడ్డాయి.బెజవాడలో నకిలీ మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. దానికి నకిలీ మస్కిటో రీఫిల్సే లేటెస్ట్ ఎవిడెన్స్. న్యూఢిల్లీకి చెందిన అస్సిడౌస్ కన్సల్టింగ్ సీనియర్ ఇన్వెస్టిగేష్ అధికారి రవీందర్ సింగ్ తీగ లాగడంతో డొంక కదిలింది. పోలీసులు బెజవాడ పాతబస్తీలో సాయి ధనలక్ష్మి షాపులో నకిలీ రీఫిల్స్ అమ్ముతున్నట్టు గుర్తించి పోలీసులకు కంప్లయింట్ చేశారు. పోలీసులు షాపులో తనిఖీ చేయడంతో 250 నకిలీ రీఫిల్స్ బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపారు.ఆ షాపు యజమానిపై కేసు బుక్ చేశారు. నకిలీ రీఫిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. విజయవాడలోనే చిట్టూరి కాంప్లెక్స్‌లో ఉన్న బ్రాహ్మణి నావెల్టీస్ నుంచి కొన్నట్టు గుర్తించారు. అక్కడ నకిలీ సరుకు దొరకలేదు కానీ సేల్స్ చేస్తున్నట్టు తేలిందని పోలీసులు చెప్పారు.నకిలీ మస్కిటో రీఫిల్స్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయంటున్నారు నిపుణులు. నకిలీ రీఫిల్స్‌లో వాడే వైట్ కిరోసిన్ వల్ల తలనొప్పి, తలతిరగటం వంటి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. నకిలీ రీఫిల్స్‌ను ఎక్కువ కాలం వాడితే తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు.మార్కెట్లో లభించే వస్తువుల్లో ఏది ఒరిజినలో ఏది నకిలీయో గుర్తించడానికి కావాల్సిన మెలకువలను వినియోగదారులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ వస్తువుపైనా అయినా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

## నవంబర్ నాటికి అమరావతి ప్రాంతంలోని ఐఏఎస్ ఎంఎల్ఏల క్వార్టర్స్ పూర్తి

అమరావతి మార్చ్ 22 అమరావతి రాజధాని నిర్మాణంపై దాఖలైన కేసులను విచారించి ఆరు మాసాల్లో రాజధానిని పూర్తి చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అమరావతి నిర్మాణానికి సంబంధించి హైకోర్టు జోక్యం చేసుకుని అక్షింతలు వేసిన తర్వాత కానీ ప్రభుత్వంలో కదలిక రాలేదు. ఈ క్రమం లో రాబోయే నవంబర్ నాటికి అమరావతి ప్రాంతంలోని ఐఏఎస్ ఎంఎల్ఏల క్వార్టర్స్ ను పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. హైకోర్టు ఆదేశాల తర్వాతే రైతులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. ఇపుడు ఐఏఎస్ ఎంఎల్ఏ క్వార్టర్స్ నిర్మాణాలు కూడా మొదలవ్వబోతోతున్నాయి. జగన్ అధికారంలోకి వచ్చేనాటికే క్వార్టర్స్ భవనాలు దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి.అధికారంలోకి వచ్చిన జగన్ వీటిని పట్టించుకోకపోవటంతో మొత్తం రాజధాని పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. క్వార్టర్స్ నిర్మాణానికి బ్యాంకుల కన్సార్షియం రు. 200 కోట్లిచ్చింది. ఇందులో సుమారు రు. 95 కోట్లు వాడేశారు. అయితే కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించలేదు.తాజా నిర్ణయంతో ముందు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన రు. 105 కోట్లతో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కూడా కాంట్రాక్టర్లకు ఆదేశాలిచ్చింది.అవసరమైన నిధుల కోసం బ్యాంకుల కన్సార్షియం తో ప్రభుత్వం మాట్లాడుతోంది. మొత్తం మీద పెండింగ్ పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించటం సంతోషమే. ఎందుకంటే సగం పనులయిన భవనాలను అలా వదిలేయటం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు.కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేయటం కన్నా పనులు పూర్తిచేసి ఆ భవనాలను ఏదో రూపంలో ఉపయోగంలోకి తీసుకురావటమే మంచిది. కానీ జగన్ ప్రభుత్వం ఆ పని చేయకుండా మొండిగా వదిలేసింది. చివరకు కోర్టు జోక్యంతో పనులు మొదలవుతున్నాయి. దీనివల్ల భవనాలు ఉపయోగంలోకి రావటమే కాకుండా వేలాది మందికి ఉపాధి కూడా దొరుకుతుంది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత క్వార్టర్స్ నిర్మాణాలు ఎక్కడివక్కడే ఆగిపోయిన విషయం తెలిసిందే.

## మెట్రో భూముల్లో రియల్



హైదరాబాద్, మార్చి 22, (న్యూస్ పల్స్)మెట్రోరైల్ సంస్థ అదనపు ఆదాయం పొందేందుకు భూములను వెంచర్లుగా డెవలప్?చేయాలనే ప్లాన్ ఆచరణకు నోచుకోవట్లేదు. వెంచర్లు ఎప్పుడూ మొదలుపెట్టాలనే దానిపై సస్పెన్స్?నెలకొంది. సిటీలో భూములకు ఉన్న డిమాండ్ బట్టి ఇప్పటికే హెచ్ఎండీఏ ఉప్పల్ భగాయత్ భూములను డెవలప్ చేసి అమ్ముకుంది. అదే బాటలో మెట్రో సంస్థ కూడా వెంచర్లకు ప్లాన్ చేసింది. ఏడాదిన్నర క్రితమే ప్లాన్? రెడీ చేసుకున్నా, కరోనాతో పెండింగ్?లో పడింది. ప్రస్తుతం అన్నీ మామూలుగా మారాయి. దీంతో మళ్లీ వెంచర్?పనులు మొదలుపెట్టాలని మెట్రో అధికారులు ఆలోచిస్తున్నారు. అయితే ప్లాట్లకు ఉండే డిమాండ్ పైన క్లారిటీ మాత్రం రావట్లేదని తెలిసింది. దీంతో వెంచర్ల డెవలప్?కు రిపోర్ట్?రెడీ చేసినా, యాక్షన్ ప్లాన్ అమలు చేయడం లేదు.అన్?లాక్?తర్వాత సిటీలో రియల్ బిజినెస్?పుంజుకుంది. అయితే ఆర్థిక సంక్షోభం పూర్తిగా తొలగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో వెంచర్లు చేస్తే డిమాండ్ ఉంటుందో లేదోననే డైలమా మెట్రోవర్గాల్లో నెలకొంది. భగాయత్ భూములకు వచ్చినంత డిమాండ్, ఆదాయం రాకపోతే నిర్వహణ, అభివృద్ధి ఖర్చులన్నీ మెట్రో సంస్థపైనే పడతాయి. మిగతా భూములపైనా ఎఫెక్ట్? పడుతుంది. ఇప్పుడిదే మెట్రో వర్గాలను ఆలోచనలో పడేసిందని సమాచారం. నిర్వహణ భారం, పెట్టుబడి, రిటర్న్స్, ప్లాట్ల అమ్మకాలపై అధికారులకు క్లారిటీ వస్తే గానీ ముందుకెళ్లేలా లేరు. దీంతోనే మెట్రో వెంచర్ లాంచింగ్?లేట్?అవుతుందని టాక్.మెట్రో సంస్థ వెంచర్ పనులను 3 నెలల్లో కంప్లీట్?చేయనుంది. రోడ్లు, కమర్షియల్ స్పేస్ నిర్మాణానికి అనుకూలంగా, చిన్న ప్లాట్లుగా చేసేందుకు ప్రతిపాదించింది. ఉప్పల్ భగాయత్ తరహాలోనే అదనపు ఫెసిలిటీస్?కల్పించి వేలానికి రెడీ చేయనుంది. త్వరగా డెవలప్‌మెంట్ పనులు పూర్తి చేసి, వేలంలో అమ్మకానికి పెట్టనుంది.ఉప్పల్, నాగోల్, మియాపూర్ డిపోల వద్ద మెట్రో రైల్?సంస్థకు వందల ఎకరాల్లో భూములు ఉన్నాయి. ఇందులో ఉప్పల్ వద్ద ప్రభుత్వం కేటాయించిన మొత్తం 142 ఎకరాల్లోని 100 ఎకరాల్లో మెట్రో డిపో, పార్కింగ్ యార్డులు, ట్రాఫిక్ నిర్వహణకు పోయింది. మిగిలిన 42 ఎకరాల భూమి ఖాళీగానే ఉంది. ఇందులో ముందు గా15 ఎకరాల్లో వెంచర్ నిర్మించి, రూ. 700 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్లాన్ చేసింది. అయితే కరోనా కారణంగా పెండింగ్?పడింది.

### చలో విజయవాడ రైతు గర్జన సభను జయప్రదం చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి సోమన్న

నంద్యాల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి సోమన్న ఓ ప్రకటనలో మాట్లాడుతూ కరువు అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 23-3-2022 తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ దగ్గర జరిగే రైతు గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయండీ అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేవలం 36 మండలాలు మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందని ఇది చాలా దారుణమన్నారు. కరువు అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు చేశారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉల్లికి కి ఎకరానికి 50 వేల నష్టపరిహారం ఇవ్వాలిఖరీఫ్ రబీలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలిపంటల నష్టాన్ని గ్రామాలలో తిరిగి రైతులను అడిగి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు చెప్పినా రిపోర్టును యధావిధిగా ప్రభుత్వానికి పంపాలని కోరారు. కేంద్ర మంత్రులు జిల్లాలో పర్యటించారు. సహాయ చర్యలకు కేంద్రం నిధులు విడుదల చేయాలితడిసిన పంటలన్నింటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలిఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

## ఇరు వర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు

మచిలీపట్నం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో డబ్బుల విషయమై ఘర్షణ చెలరేగింది. ఈ ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. బలరామునిపేటకు చెందిన వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య వివాదం చెలరేగింది. అధికార పార్టీకి చెందిన డివిజన్ కార్పొరేటర్ ప్రోత్సాహంతోనే తమపై దాడి చేశారని బాధితులు అంటున్నారు. ఘర్షణలో గాయపడిన ఇరు వర్గాలకు చెందిన 9 మంది ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. గతంలోనే ఒకరిపై ఒకరు స్టేషన్ లో ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రస్తుత దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జనసేన కార్యాలయంపై దాడి

కర్నూలు కర్నూలు జిల్లాలోని జనసేన కార్యాలయంపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆఫీస్‌లో ఉన్న వారిని బయటికి పంపి ఫర్నీచర్ బయటపడేసి తాళం వేశారు. జనసేన ఆఫీస్ ఖాళీ చేయాలని రెండు రోజుల క్రితం యజమానులు చెప్పారు. అయితే ఐదేళ్ల రెంట్ అగ్రిమెంట్ ఉందని... అద్దె కూడా చెల్లిస్తున్నామని జనసేన నేతలు చెబుతున్నారు. జనసేన ఆఫీస్ ఖాళీ చేయించేందుకు వైసీపీ నేతలు ఇదంతా చేశారని జనసేన నేత సురేష్ ఆరోపించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నెల్లూరు నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వరికుంటపాడు కోల్డ్ స్టోరేజ్ సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతిచెందినది పామూరుకు చెందిన నాదెండ్ల వెంకటరావుగా గుర్తించినట్టు సమాచారం. ప్రమాదంలో గాయాలబారిన పడిన ఇద్దరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ, చైతన్య పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.అనంతపురంలో ఎస్. ఎఫ్ ఐ, ఎన్ఎస్. యుఐ, అర్. ఎస్. ఎఫ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మండల కేంద్రంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఎలాంటి అనుమతులు లేకుండా నారాయణ, చైతన్య కార్పొరేట్ పాఠశాలలు డిస్కౌంట్ల పేర్లతో ముందస్తుగా ఆడిషన్లు నిర్వహిస్తున్నారని,అదేవిధంగా విచ్చలవిడిగా, కరపత్రాలు పంచుతూ ప్రచారాలు నిర్వహిస్తు ఫ్లెక్సీ లను, బోర్డింగ్ లను సైతం ఏర్పాటు చేస్తున్నారని ఆ పాఠశాల యాజమాన్యం పై విద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యానర్లను ఫ్లెక్సీలను కరపత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

## రైతు కోసం కార్యక్రమం విజయవంతం చేయాలి

గూడూరు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈనెల 23వ తేదీన నెల్లూరు లో జరిగే రైతు కోసం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గూడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్నికలకు ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని తెలిపారు రైతులకు సకాలంలో యూరియా అందక అధిక పెట్టుబడులు పెట్టి ధాన్యం పండిస్తే గిట్టుబాటు ధర లేక నష్టాలు చవి చూస్తున్నారు అని రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనబడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు రైతుల కోసం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నెల్లూరు లో జరిగే రైతు కోసం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా రైతులు పాల్గొన్న జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య రూరల్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రాజు ,పాల్గొన్నారు

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ఎఐటియూసి జిల్లా కార్యదర్శి ప్రసాద్

పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు




నంద్యాల ( విభారె) :- ఎఐటియూసి రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం నాడు నంద్యాల పట్టణంలో సాయి బాబా నగర సెంటర్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా కార్యదర్శి కె. ప్రసాద్. పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఏ సుబ్బరాయుడు. గోసుపాడు మండల కార్యదర్శి సుబ్బయ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏఐటీయూసీ దాని అనుబంధ కార్మిక సంఘాల నాయకులను కార్యకర్తలను గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల నుండి వాడుకున్న 16 వందల కోట్ల రూపాయలు తిరిగి సంక్షేమ బోర్డు లో జమ చేయాలని కోరారు. శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమాలకు నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గత ఇరవై రోజుల నుండి ఏఐటీయూసీ నాయకులను కార్యకర్తలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను కార్యకర్తలను ఎక్కడికి ఎక్కడ హౌస్ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధాలు చేయడం చాలా దారుణమన్నారు . రెండు రోజులు ముందే నిర్బంధించడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు . ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలు మానుకుని కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుశీలమ్మ సుబ్బమ్మ మహబూబ్ బాషా రంగడు కాశిరెడ్డి లక్ష్మీదేవి వరాలు పెద్దక్క లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ రణభేరిపై మండిపడ్డ విద్యార్థి యువజన సంఘాల నాయకులు.



రాయలసీమ డిక్లరేషన్,విభజన చట్టం అమలు ఏమైంది?

రాయలసీమ ప్రజలకు మరియు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డికి క్షమాపణ చెప్పాలి

.ఆర్ విపిఎస్,ఆర్ విఎస్,ఆర్ వైపిఎస్,ఎస్ విఎస్ డిమాండ్.

కర్నూల్ ( విభారె) :-రాష్ట్ర బిజెపి కడప జిల్లాలో నిర్వహించిన రాయలసీమ రణభేరిపై స్థానిక కృష్ణకాంత్ ప్లాజాలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్,రాయలసీమ విద్యార్థి సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు సీమకృష్ణ,రాయలసీమ యవజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వివి నాయుడు,సీమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు లాజరస్ మాట్లాడుతూ రాయలసీమలోని కడప జిల్లాలో రాష్ట్ర బిజెపి నాయకులు రాయలసీమ రణభేరి పేరుతో సీమ ప్రజలను మోసం చేయడానికే ఈ సభ నిర్వహించారని మండిపడ్డారు. అదేవిధంగా రాయలసీమ సీమ అభివృద్ధి చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని మాట్లాడించంకపోవటాన్ని బిజెపి రాష్ట్ర శాఖను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాయలసీమ పట్ల అవగాహన ఉన్నటువంటి బైరెడ్డిని బిజెపి రాష్ట్ర శాఖ మాట్లాడించకపోవడం,బిజెపి రాష్ట్ర శాఖ బైరెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. అదేవిధంగా రాయలసీమ రణభేరి లో రాయలసీమ అంశాలు మాట్లాడకుండా,రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మతతత్వ రాజకీయాలు చేస్తున్న బిజెపికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.సీమ పట్ల బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2018 లో రాయలసీమ డిక్లరేషన్ పై స్పందించి పోరాటం కొనసాగించాలని,విభజన చట్టంలో ఉన్నటువంటి గుంతకల్లు రైల్వే జోన్,కడప ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసి బిజెపి చిత్తశుద్ధి తెలియజేయాలన్నారు. రాయలసీమ వలసలు,నిరుద్యోగం,రైతుల ఆత్మహత్యలు మరియు విభజనచట్టంలో ఉన్న ప్రాజెక్టుల గురించి రాయలసీమ రణభేరిలో ప్రస్తావించకుండా రాయలసీమ ప్రజల్ని మోసం చేయడమే అని మండిపడ్డారు. భవిష్యత్తులో రాయలసీమలో బిజెపి కార్యక్రమాలను రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ను అడ్డుకుంటామని హెచ్చరించారు. డెకరేషన్ అంశాలపైన విభజన చట్టం వాటిపై స్పందించకపోతే కర్నూల్లో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్,వసంత్ ,ఆర్ వి ఎస్ జిల్లా అధ్యక్షుడు హరినాయుడు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయంపై దుండగుల దాడి



ఫర్నిచర్ రోడ్డు బయట పడేయటం అమానుషం

వైయస్సార్సీపి పార్టీ నాయకుల అండతో దౌర్జన్యం

:-జనసేన పార్టీ నాయకులు సురేష్ బాబు , నక్కల మిట్ట శ్రీనివాసులు, మహబూబ్ బాషా, అర్షద్, పవన్, శ్రీనివాసులు

కర్నూలుమార్చి 22 :- కర్నూలు నగరంలోని గణేష్ నగర్ లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంపై వైఎస్సార్సీపీ నాయకుల అండతో కొంతమంది దుండగులు కార్యాలయంలోకి బలవంతంగా చొచ్చుకు వచ్చి ఫర్నిచర్ను రోడ్డు బయట పడేశారని జనసేన పార్టీ పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జి సురేష్ బాబు కర్నూలు నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు విమర్శించారు. ఓ అధికార పార్టీ నాయకుల కార్యాలయం జనసేన పార్టీ కార్యాలయం ఎదురుగా ఉందని , ఇది జీర్ణించుకోలేని కొంతమంది ఈ కార్యాలయాన్ని ఇక్కడి నుండి ఖాళీ చేయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అందులో భాగంగానే బాడుగ కట్టడం లేదన్న అబద్ధపు నెపంతో మంగళవారం ఉదయం కార్యాలయంలోకి చొచ్చుకు వచ్చి రౌడీ మూకలతో ఫర్నిచర్ అంతా రోడ్డున పడేసే విధంగా చేశారని అన్నారు. ఇదంతా జరగడానికి ప్రధాన కారణం కొంతమంది అధికార పార్టీ నాయకులని వారు ఆరోపించారు. ఇటీవలే జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో పవన్కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో తాము తప్పకుండా అధికారంలోకి వస్తామని ప్రకటించారని , ఈ విషయం జీర్ణించుకోలేని నాయకులు తమ కార్యాలయంపై దాడి చేయించారని అన్నారు. ఈ విషయంపై మూడవ పట్టణ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశామని వారు అన్నారు. ఫర్నిచర్ అంతా రోడ్డుపైన పడేయటమే కాకుండా , పార్టీ కార్యాలయానికి తాళం కూడా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## నిరుపేద కుటుంబానికి సహాయం:: కోట్ల అభిమానుల వితరణ




ఎమ్మిగనూరు ( విభారె)మండలం, కె. తిమ్మాపురం గ్రామంలో తల్లిదండ్రులను (లేట్ మాల జయమ్మ, లేట్ మాల తిమ్మప్ప) సర్వం కోల్పోయిన కూతురు మాల రాధ వివాహానికి కోట్ల అభిమానులు, కె. తిమ్మాపురం గ్రామ టిడిపి ప్రముఖ నాయకులు అడ్వకేట్ కె. టి. మల్లికార్జున, ఆర్.ఎం.పి డాక్టర్ సోమప్ప, బి. జి. చంద్రన్న, బి. టి. చిన్న హనుమంతు, ఆటో వీరేష్, బలిజ వీరేష్, ఉప్పర వీరేష్, సి. శంకరయ్య, శివమణి, ఈడిగ నరసప్ప, బలిజ ప్రసన్న, సి. రామలింగ, మాల తిమ్మప్ప, మాల రంగన్న లు దాతృత్వంగా బంగారు తాళిబొట్టు, నగదు 5000/- రూపాయలు, 5 క్వింటాళ్ల బియ్యము, బట్టలు మొదలైనవి ఇవ్వడం జరిగినది, అన్నారు ఈ సందర్భంగా అడ్వకేట్ కె.టి. మల్లికార్జున గారు మాట్లాడుతూ పేదలకు గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వము అధికారంలో ఉన్నప్పుడు పేద మహిళలకు పెళ్లి కానుకలు ఇచ్చేవారని వైసిపి పార్టీ అధికారం చేపట్టాక పూర్తిగా నిరుపేద మహిళలను పట్టించుకోవడంలేదని సక్రమంగా ఈ అధికారిక రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం పెళ్లికానుక ఇచ్చి ఉంటే ఇలాంటి పేదలకు ఎంతో ఉపయోగం ఉండేదని, ఈ ప్రభుత్వం సక్రమంగా ఇలాంటి పథకాలు అమలు చేయకపోవడం వల్ల ఎంతోమంది నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నీరు పేదలకు పథకాలు సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల ఆందోళన

ఆదోని ( విభారె) ఆర్టీసీ కార్మికులకు సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న ఆందోళన 10 రోజులుగా కొనసాగుతున్నది సోమవారము ఆర్ టి సి డిపో ఎదుట ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ నాయకులు లక్ష్మన్న రాఘవ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లకు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు అక్రమ ఓటీలను రద్దు చేయాలన్నారు సిక్ కాలనీకి పూర్తి వేతనం చెల్లించాలని కోరారు ఆదోని కర్నూల్ రూట్ సమయాన్ని కేటాయించాలని డిపోకు నష్టం చేకూర్చే చెన్నై బస్సు సర్వీస్ పై పునరాలోచించాలని అన్నారు నాయకులు అజమ్ ఖాన్ రఘు గోవిందు సింగ్ మే సేరాజ్ కె ఎస్ రెడ్డి నాగరాజ్ రవి పాల్గొన్నారు

## 'గని' పంచ్ పార్టీలో నవ్వుల 'పంచ్'లు..!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా ''గని''. బాక్సింగ్ బ్యాక్ డ్రాప్ లో కొత్త దర్శకుడు కిరణ్ కొర్రపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 8న వరల్డ్ వైడ్ గా థియేటర్లలోకి రాబోతోంది.ఇప్పటికే 'గని' సినిమా నుంచి వచ్చిన టీజర్ - సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో మిలియన్ల వ్యూస్ తో దూసుకుపోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఆ మధ్య రిలీజ్ చేసిన 'గని పంచ్ పార్టీ' ప్రోమో అలరించింది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ పార్టీకి సంబంధించిన ఫుల్ వీడియోని రిలీజ్ చేశారు.'గని' టీమ్ అంతా ఒకచోట చేరి స్టాండ్-అప్ కామెడీతో సెలబ్రేట్ చేసుకున్న ఈ వీడియో ఆకట్టుకుంటోంది. నటీనటులు - టెక్నిషియన్స్ అందరూ ఇందులో పాల్గొన్నారు. 'జబర్దస్త్' కమెడియన్స్ ఆటో రామ్ ప్రసాద్ - బుల్లెట్ భాస్కర్ - ఇమ్మాన్యుయేల్ - రోహిణి హోస్టింగ్ లో చిత్ర బృందం మీద సరదా పంచులు వేస్తూ నవ్వులు పూయించారు.చివర్లో వరుణ్ తేజ్ బాక్సింగ్ కు హ్యాండ్స్ కాదు.. నేను కాళ్ళు వాడానని పంచ్ ఇచ్చారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది. రాబోయే రోజుల్లో మేకర్స్ అగ్రెసివ్ గా ప్రచార కార్యక్రమాలు చేయడానికి ప్లాన్ చేసుకుంటున్నారు.'గని' చిత్రంలో వరుణ్ తేజ్ సరసన బాలీవుడ్ భామ సైఈ మంజ్రేకర్ హీరోయిన్ గా నటించింది. ఉపేంద్ర - సునీల్ శెట్టి - జగపతిబాబు - నదియా - నరేష్ - తనికెళ్ళ భరణి - నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రలు పోషించారు.అల్లు అరవింద్ సమర్పణలో అల్లు బాబీ కంపెనీ మరియు రెనసాన్స్ పిక్చర్స్ బ్యానర్లపై అల్లు వెంకటేష్ (బాబీ) - సిద్దు ముద్ద సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూర్చారు. అబ్బూరి రవి సంభాషణలు రాశారు. జార్జ్ సి.విలియమ్స్ సినిమాటోగ్రఫీ అందించగా.. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ వర్క్ చేసారు.

## ఆర్ఆర్ఆర్ కు ప్లాన్ చేస్తున్నారా? టికెట్ ఖర్చు ఎంతంటే?

ఒక పెద్ద హీరో సినిమా విడుదలవుతుందంటే.. తెలుగు రాష్ట్రాల్లో అదో సందడి. అలాంటిది ఏకంగా ముగ్గురు అగ్ర హీరోలు (తారక్.. రాంచరణ్.. రాజమౌళి) ప్రాణం పెట్టి తీసిన సినిమా విడుదలవుతుంటే హడావుడి ఎంతన్నది తాజా రచ్చ చూస్తే ఇట్టే అర్థమైపోతుంది.తెలుగు ప్రేక్షకుడు కాదు.. ఆలిండియాలోనే కాదు.. విదేశాల్లోనూ ఈ సినిమా మీద ఉన్న అంచనాలు అన్నిఇన్ని కావు. దాదాపు రూ.300 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందించిన ఈ సినిమా కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో టికెట్ల ధరల్ని పెంచేస్తూ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి.ఇప్పటివరకు అమల్లో ఉన్న ధరలు కాకుండా.. ఈ సినిమా కోసం రెండు తెలుగు రాష్ట్రాలు ప్రత్యేకంగా నిర్ణయం తీసుకొని.. ఆదేశాలు జారీ చేశారు. ఈ టికెట్ల ధరల పెంపు పుణ్యమా అని.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శితమయ్యే ఈ మూవీ దెబ్బకు జస్ట్ ఒక రోజులో రూ.40 నుంచి రూ.50 కోట్ల మధ్య ఆదాయం వస్తుందన్న మాట వినిపిస్తోంది.అంటే.. ఆలిండియాతో పాటు విదేశాలతో వచ్చే కలెక్షన్ల లెక్క కట్టినప్పుడు భారీ మొత్తం ఖాయమన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. ఒక అంచనా ప్రకారం.. ఒక రోజులోనే దగ్గర దగ్గర రూ.100 కోట్ల కలెక్షన్లు వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన ఇక.. ఈ సినిమా కోసం ఒక్కొక్కరు ఎంతేసి ఖర్చు పెట్టాలన్న దానిపై తాజాగా క్లారిటీ వచ్చేసింది.ఏపీలో ఇంతకు ముందే ఈ సినిమా టికెట్ల ధరల్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంటే.. తాజాగా తెలంగాణలోనూ 'ఆర్ఆర్ఆర్' మూవీ విడుదలైన మొదటి మూడు రోజులకు భారీగా ధరల్ని డిసైడ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ లెక్కన ఆర్ఆర్ఆర్ మూవీ చూడాలంటే.. జేబులో ఉన్న డబ్బుల్ని అభిమానం కోసం బయటకు తీస్తే తప్పించి.. వెండితెర మీద ఆర్ఆర్ఆర్ బొమ్మ చూసే అవకాశం దక్కదని చెప్పాలి.ఇదిలా ఉంటే.. సినిమా విడుదలకు కాస్తంత ముందుగా తెలంగాణ ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ కోసం ప్రత్యేక టికెట్ల ధరల్ని ఫిక్స్ చేసింది. దీంతో.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ధరల తేడా ఎంతన్న విషయం ఇట్టే అర్థం కాక మానదు. ఏపీలో ఆర్ఆర్ఆర్ మూవీని చూడాలంటే కనిష్ఠంగా ఉన్న టికెట్ ధర రూ.105 అయితే.. గరిష్ఠంగా రూ.325 ఉంది. తెలంగాణ విషయానికి వస్తే కనిష్ఠంగా రూ.80తో మొదలైతే గరిష్ఠంగా రూ.450గా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ.. ఏ థియేటర్లో ఎంతేసి చొప్పున టికెట్ల ధరల్ని డిసైడ్ అయ్యారన్నది చూస్తే..

ఆంధ్రప్రదేశ్ లో..

మున్సిపాలిటీల్లో - ఏసీ థియేటర్లలో రూ.135 రూ.155- నాన్ ఏసీలో టికెట్ రూ.105 రూ.125- స్పెషల్ థియేటర్లలో రూ.135 రూ.175- మల్టీప్లెక్సో టికెట్ రూ.200 రూ. 325

కార్పొరేషన్లలో..- ఏసీ థియేటర్లలో రూ.145 రూ.175- నాన్ ఏసీలో టికెట్ రూ.115 రూ.135- స్పెషల్ థియేటర్లలో రూ.175 రూ.200- మల్టీప్లెక్సో టికెట్ రూ.225 రూ. 325తెలంగాణ విషయానికి వస్తే.. ఆర్ఆర్ఆర్ మూవీ కోసం ప్రత్యేక ధరల్ని డిసైడ్ చేశారు. సినిమా విడుదలైన మొదటి మూడు రోజులు ఇప్పుడు వసూలు చేసే టికెట్ల ధరలకు అదనంగా రూ.50 చొప్పున వసూలు చేశారు. మూడు రోజుల తర్వాత మాత్రం రూ.30 చొప్పున వసూలు చేయనున్నారు.దీంతో.. సాధారణ ఏసీ థియేటర్లలో మొదటి మూడు రోజులు రూ.100 రూ.225 మల్టీప్లెక్సుల్లో మొదటి మూడు రోజులు రూ.395.. మూడు రోజుల తర్వాత నుంచి రూ.345 చొప్పున వసూలు చేస్తారు. మల్టీప్లెక్సుల్లోని రిక్లైనర్లకు మొదటి మూడు రోజులు రూ.450 చొప్పున.. మూడు రోజుల తర్వాత రూ.400 చొప్పున వసూలు చేయనున్నారు.

## మాల్దీవుల్లో ఐస్ క్రీమ్ అమ్ముతున్న పాప ఎవరు?

ఇటీవలి కాలంలో మాల్దీవుల విహారంలో పలువురు అందాల కథానాయికలు మంటలు పుట్టించిన సంగతి తెలిసిందే. సారా అలీఖాన్ - జాన్వీ కపూర్ - పూజా హెగ్డే- కియరా అద్వాణీ లాంటి భామలు ఒంటరి దీవుల్ని బికినీలతో అట్టుడికించారు.ఇప్పుడు మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా వంతు. ఈ బ్యూటీ ఏకంగా బీచ్ లో ఐస్ క్రీమ్ అమ్ముతోంది. ఇదిగో ఇలా ఐస్ క్రీమ్ ట్రంక్ తో ఉన్న రిక్షా తొక్కుతూ కుర్రకారు గుండెల్లో చలిమంటలు పుట్టించింది. ఐస్ క్రీమ్ అంతా ఆ ట్రంక్ లోనే ఉంది.. ఎవరో కనిపెట్టండి! అంటూ ఫజిల్ వేసింది. అయినా పాల నురుగు అందం ముందు ఐస్ క్రీమ్ రంగు తేలిపోతుంది. అలా బీచ్ లో చిట్టి పొట్టి నిక్కరులో ఐస్ క్రీమ్ అమ్మేస్తూ అలా కవ్విస్తే చాలా కష్టం అంటూ యూత్ ఒకటే ఫీలవుతున్నారు. మూవ్ అండ్ పిక్ మాల్దీవ్స్ హ్యాష్ ట్యాగ్ తో ఈ ఫోటో వైరల్ గా మారింది. తమన్నా ఏదో యాడ్ షూట్ కోసం మాల్దీవుల్లో అడుగుపెట్టిందా? లేక ఎఫ్ 3 చిత్రీకరణలో భాగంగా ఇలా చేస్తోందా? అన్నదానికి క్లూ ఇవ్వలేదు.సీటీమార్ - మాస్ట్రో చిత్రాలు నిరాశపరిచాక తమన్నా భాటియా తన తదుపరి హిందీ చిత్రం బాబ్లీ బౌన్సర్ లో మహిళా బౌన్సర్ లో కనిపించనుంది. మధుర్ భండార్కర్ సీరియస్ సినిమాలు తీయడానికి పేరు తెచ్చుకున్నప్పటికీ బాబ్లీ బౌన్సర్ తన సాధారణ సినిమా అని ప్రకటించారు . ఈ స్లైస్-ఆఫ్-లైఫ్ కామెడీ చిత్రం తమన్నాలో మునుపెన్నడూ చూడని కోణాన్ని తెరపైకి తేనుంది. తొలిసారిగా మాధుర్ తో చేతులు కలిపింది మిల్కీ.బాబ్లీ బౌన్సర్ అనేది ఉత్తర భారతదేశంలోని అసోలా ఫతేపూర్ నిజ జీవిత 'బౌన్సర్ టౌన్'లో జరిగిన ఒక మహిళా బౌన్సర్ తదుపరి కాలపు కల్పిత కథనం. నేను బాబ్లీ బౌన్సర్ ని చదివిన వెంటనే ఆ పాత్రతో ప్రేమలో పడ్డాను. ఎందుకంటే ఇది నాకు కనిపించిన డెప్త్ తో కూడిన అత్యంత ఆసక్తికరమైన వినోదాత్మక పాత్రలలో ఒకటి అని చిత్రీకరణ ప్రారంభోత్సవంలో వెల్లడించింది తమ్మూ.మధుర్ సర్ చిరస్మరణీయమైన పాత్రలతో మహిళా కథానాయకులను అసాధారణంగా తీర్చిదిద్దడంలో నైపుణ్యం కలిగి ఉన్న దర్శకులు. బాబ్లీ కూడా దీనికి మినహాయింపు కాదు. మొదటిసారిగా ఒక చలనచిత్రం మహిళా బౌన్సర్ కథనాన్ని తెరపై ఆవిష్కరిస్తోంది. బౌన్సర్ గా నటించే అవకాశం లభించినందుకు నేను సంతోషిస్తున్నాను. ఈ కొత్త విశ్వాన్ని అన్వేషించడానికి నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను... అని తెలిపింది. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా హిందీ- తమిళం- తెలుగు భాషల్లో విడుదల కానుంది.మాధుర్ చిత్రంలో తమన్నా పాత్ర సినిమా చరిత్రలో ఇంతకు ముందెన్నడూ ఎవరూ ప్రయత్నించనిది. తమన్నా ప్రస్తుతం పలు భాషల్లో అనేక సినిమాలు చేస్తోంది. గుర్తుందా సీతాకాలం (తెలుగు)- ఎఫ్ 3 (తెలుగు) - ప్లాన్ ఎ ప్లాన్ బి (హిందీ)- యార్ దోస్త్ ప్రస్తుతం క్యూలో ఉన్నాయి. ఆమె ఇటీవలి డ్యాన్స్ నంబర్ కొడ్తే... సాంగ్ తో ఆకట్టుకుంది. గని చిత్రంలోని సాంగ్ ఇది.



## ఇదేం షాట్ అయ్యా యష్ ధుల్ .. నేనెక్కడా చూడలే.. బంతిని చూడకుండానే!




ఐపీఎల్-2022కు సమయం దగ్గర పడడంతో అన్ని జట్లు నెట్స్‌లో చెమటోడ్చుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ యువ ఆటగాడు, భారత అండర్-19 కెప్టెన్ యష్ ధుల్ నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. నెట్ సెషన్‌లో అద్భుతమైన షాట్‌లు ఆడుతూ యష్ ధుల్ అలరించాడు. అయితే ప్రాక్టీస్‌లో భాగంగా బంతిని చూడకుండానే 'అప్పర్ కట్' షాట్ ఆడి అందరనీ యష్ ఆశ్చర్యపరిచాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఢిల్లీ క్యాపిటల్స్ ట్విటర్‌లో షేర్ చేసింది.ఇక అండర్-19 ప్రపంచకప్‌లో అదరగొట్టిన యష్ ధుల్‌ను ఐపీఎల్ మెగా వేలంలో రూ.50 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. అండర్-19 ప్రపంచకప్ 2022లో భారత జట్టును ఛాంపియన్ యశ్ ధుల్ నిలిపిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు విదేశీ స్టార్ ఆటగాళ్లు దూరం కానున్నారు. పాకిస్తాన్ పర్యటన కారణంగా ఆస్ట్రేలియా ఆటగాళ్లు డేవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్ ఢిల్లీ జట్టు ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. మరో వైపు ఆ జట్టు పేస్ బౌలర్ అన్రీచ్ నోర్జే జట్టులో చేరినప్పటికీ అతడు అందుబాటుపై ఇంకా సందిగ్ధం నెలకొంది. ఇక మార్చి 26 నుంచి ఐపీఎల్-2022 ప్రారంభం కానుంది. ఢిల్లీ క్యాపిటిల్స్ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 27న ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

## మన కెప్టెన్ల సంపాదన ఎంతో తెలుసా? డుప్లెసిస్ వంద కోట్లకు పైగానే.. పాపం కేన్ మామ మాత్రం

క్రికెట్.. భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన క్రీడ. క్రికెటర్లను ఆరాధ్య దైవంగా భావించే వీరాభిమానులు మన దేశంలో ఎంతో మంది ఉన్నారు. మన క్రికెటర్లకు కేవలం ఇక్కడే కాదు ప్రపంచ వ్యాప్తంగానూ క్రేజ్ ఉంది. విదేశాల్లోనూ ఫ్యాన్స్ ఉన్నారు. మరి క్రికెట్ అంటేనే కాసుల వర్షం అంటుంటారు. వివిధ కంపెనీలు సైతం క్రికెట్ ఈవెంట్లకు స్పాన్సర్ చేస్తూ తమ బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకుంటాయి. ఇక వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్లతో ఎండార్స్ చేయించడానికి కంపెనీలు ఆసక్తి చూపడం సహజం. ముఖ్యంగా టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని,

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190